# ఘరే-బాయిరే

## రవీంద్రనాథ్ ఠాకూర్

### విమల చెప్పిన కథ

ఇవాళ నాకు మా అమ్మ పాపటమొదట్లో పెట్టుకున్న కుంకుం బొట్టూ, వెడల్పయిన ఎర్రంచుగల ఆమెచీరా, గంభీరమై ప్రశాంతమైన ఆమెకళ్లూ నా కళ్ళముందు మెదులుతున్నాయి.

ఆమెముఖం నల్లగా ఉన్నా, కళగాఉండి, అందాన్ని తలదన్నేలా ఉండేది.

అందరూ నన్ను మా అమ్మపోలికే నంటారు. ఆమాట వింటే నాకు చిన్నతనములో కోపం వచ్చేది. నేను ప్రబంధనాయికలా ఉండాలని కోరుకునేదాన్ని.

నాకు పెళ్ళి నిశ్చయమైనప్పుడు దైవజ్ఞుడు నా చెయ్యి చూసి, "శుభలక్షణాలుగల పిల్ల. ఆదర్శగృహిణి అవుతుంది." అన్నాడు. ఆమాట విన్న స్త్రీలు, "ఇంకేం? తల్లిపోలికే వచ్చింది." అన్నారు.

నన్ను రాజాలకిచ్చిపెళ్ళి చేశారు. ఐతే నాభర్త, నా చిన్నతనములో చదివిన కథల్లో రాజకుమారుల లాటివాడుకాడు. నాలాగే ఆయనకూడా నలుపు.

శ్రద్ధలో సౌందర్యం ఉన్నది. మానాన్నకు స్వయంగా సేవలోని శ్రద్ధ నేను కళ్ళారా చూశాను. దానిశక్తి నాకు పసితనంలోనే బోధపడింది.

పెళ్ళి అయాక నేను తెల్లవారుజామున, నా భర్తకు నిద్రాభంగము కలగకుండా, ఆయన పాదధూళి తలదాల్చేదాన్ని. ఒకరోజాయన మేలుకుని, "ఏమిటిది, విమలా? ఏం చేస్తున్నావు?" అని నవ్వుతూ అడిగాడు. నాకు చచ్చేసిగ్గయింది. నేనాపని పుణ్యం ఆర్జించడానికి చేస్తున్నానని ఆయన అనుకుని ఉండవచ్చు. కాని అదేమీలేదు. నా స్త్రీహృదయము ఆరాధించకుండా ప్రేమించలేదు.

మా అత్తవారిల్లు పాదుషాల నాటిది. అక్కడి మర్యాదలు మొగలులవీ, పఠానులవీనూ. అక్కడి ఆచారాలు మను పరాశరుల నాటివి. కాని నాభర్త పూర్తిగా అధునాతనుడు. వాళ్ళ వంశంలో కాలేజీచదువు చదివి, ఎమ్మే పాసయిన మొదటివాడు అయనే. వారి వంశంలో అందరికీ ఉండే తాగుడూ. ఇతర దురలవాట్లూ ఆయనకు లేవు. ఆయన అన్నగారు చిన్నతనంలోనే తెగతాగి, నిస్సంతుగా చనిపోయాడు.

నా అత్తమామలు చాలాకాలంక్రితమే పోయారు. ఇంటిపెత్తనం నాభర్త ముత్తవతల్లిది. ఆమెకు నాభర్తే పంచప్రాణాలూ. కనకనే నాభర్త ఇంటిసంప్రదాయాలన్నిటినీ ఉల్లఘించడం సాధ్యమయింది. నాకుచదువు చెప్పడానికీ, తోడుగా ఉండడానికీ ఆయన మిస్ గిల్బీని ఇంటికి తెచ్చినప్పుడు ఇంటా, బయటా ఎందరో విషం కక్కారు – కాని ఆయన లక్ష్యపెట్టలేదు.

అప్పటి కింకా నాభర్త కలకత్తాలో ఉండి ఎమ్మేకు చదువుతున్నాడు. దాదాపు రోజూ ఆయనవద్దనుంచి నాకు చిన్నచిన్న ఉత్తరాలు వస్తూండేవి. నేను వాటి నొక చందనంపెట్టెలో పెట్టి, వాటిపైన పూలు వేసేదాన్ని. నాప్రాణాని కాయనే కథలోని రాజకుమారుడు. నా కాయన సరసన స్థానం ఉన్నది. కాని ఆయన పాదాల వద్ద నాకుగల స్థానమే నాకు అపారమైన ఆనంద మిచ్చేది.

అటుతరవాత నేను ఆధునిక జీవితమూ, ఆధునికభాషా నేర్చుకోవటంవల్ల ఈమాటలు సిగ్గుపడేలాగా కనిపిస్తాయి. అయితే నేను స్త్రీనిగా జన్మించటం నాచేతిలో లేనట్లే, స్త్రీ హృదయంలోని ఆరాధనకూడా కాగితంమీద పెట్టరానిది; ఆధునికతద్వారానే నాకీ సంగతి తెలిసింది.

అయితే నా భర్త నా ఆరాధనకు అవకాశము ఇవ్వలేదు. అదే ఆయనలోని గొప్పగుణం. అడిగి భార్య ఆరాధనను తమ హక్కుగా పొందేవాళ్ళు పిరికిపందలు. అది ఉభయులకూ అవమానకరమే. నాభర్త నన్ను తనప్రేమలో ముంచెత్తేవాడు. అయితే నాకు పుచ్చుకోవడంకన్న ఇవ్వడమే ఎక్కువ అవసరంగా ఉండేది.

భర్త భార్యవద్దకు ఎప్పుడుబడితే అప్పుడు రావటం వంశాచార విరుద్ధం. అందుచేత ఆయన ఏయేవేళలలో నావద్దకు వచ్చేదీ నాకు తెలుసు. రోజూ సాయంకాలంవేళ నేను స్నానం చేసి, తల దువ్వుకుని, బొట్టుపెట్టుకుని, చీరె కట్టుకుని ఆయనకోసం ఎదురుచూసేదాన్ని. రోజూ ఆవేళప్పుడు ఆయనతో గడిపే కొద్దిక్షణాలూ నా ప్రాణానికి అనంతంగా తోచేవి.

భార్యాభర్తలూ, వారి పరస్పర ప్రేమా సమానంగా ఉండాలని నా భర్త మతం. కాని ఆరాధనవల్ల సమత్వాని కేమీ విఘ్నం కలగదని నా హృదయం ఎరుగును.

నా భర్త నా పూజను స్వీకరించిఉంటే, నాకు చాలా మేలై ఉండేది. ఆయన నన్ను అలంకరించడంలోనూ, విద్యావతిని చెయ్యడంలోనూ, నేను కోరినవీ, కోరనివీ సమకూర్చడంలోనూ తన



ప్రేమ వ్యక్తంచేశాడు. ఆయన ప్రేమ ఆయన కళ్ళలో కనిపించేది. ఆయన నా శరీరాన్ని ఒక సౌగంధిక పుష్పం లాగానూ, నా స్వభావాన్ని దేవుడిచ్చిన వరంలాగానూ ప్రేమించాడు.

ఆ ప్రేమకు నేను గర్వించాను. కాని అలాటిఅతిశయం మంచిది కాదు. దానితో స్త్రీ సింహాసనం ఎక్కి, భర్తయొక్క ఆరాధనను ఇంకాఇంకా కోరుతూ, సంతృప్తి ఎరగకుండా పోతుంది. స్త్రీ తరించాలంటే ఆ గర్వాన్ని ఆరాధనతో క్షాళనం చెయ్యవలసిందే.

మేము ఆనందంగా ఉన్న ఆ దినాలలో ఎందరు అసూయతో కళ్ళలో నిప్పులు పోసుకున్నదీ నా కీనాడు జ్ఞాపకంవస్తోంది. అయితే అదృష్టం ఎల్లకాలమూ కలిసిరాదు. దేవుడెన్నో వరాలు అనుగ్రహించవచ్చు, కాని వాటిని దక్కించుకునే శక్తి మనలో ఉండాలి.

నా భర్త తల్లీ, ముత్తవ్వా పేరుమోసిన అందగత్తెలు. విధవరాలైన మా తోడికోడలుకూడా అసాధారణ సౌందర్యవతి. వారికి పట్టిన దుర్గతి చూసి నా భర్త ముత్తవతల్లి తన మిగిలిన మనమడికి అందగత్తె రావాలని పట్టుబట్టక, నాలో గల శుభలక్షణాలు చూసి నన్ను చేసుకోనిచ్చింది. లేనిపక్షంలో నా కీ ఇంట స్థానం లేకపోను.

విలాసాలకు ఆలవాలమైన ఈ ఇంట్లో స్త్రీలకు తగిన మన్నన చాలా అరుదుగా లభించేది. ఒక వంక సురాపానమూ, వేశ్యా నాట్యాలూ సాగుతూ ఉంటే, మరొకవంక అశ్రువులు రాలుస్తూ, గొప్పయింటి "రాణి"ల హోదాతో వారేదో విధంగా తమ అభిమానాన్ని నిలబెట్టుకో గలిగారు. తాగుడూ, వేశ్యలూ దరికి రానివ్వని భర్త కావటంలో నా ఘనత ఏమైనా ఉందా? నా అదృష్టం తప్ప మరేమీ లేదు. నా తోడికోడలు దురదృష్టవంతురాలు; ఆమె అందం అడవి గాచిన వెన్నెల.

మా తోడికోడలుకు నా భర్త అవలంబించే ఆధునిక పద్ధతులు సరిపడవు. ఆయన నన్ను అందలం ఎక్కించినందుకూ, నాకాయన కొత్తకొత్త బట్టలు కట్టబెట్టినందుకూ, నే నాయన హృదయాన్ని దొంగిలించానని నన్నామె చాలగా ఆడిపోసుకున్నది. నా భర్త అవంతా సహించడమే గాక, ఆమెపైన ఆగ్రహించవద్దని ప్రాధేయపడ్డాడు. ఆమె కోరికలు ఎంత అసంగతంగా ఉన్నా ఆయన తీర్చేవాడు. మంచితనానికైనా ఒక హద్దుండా లనుకుంటాను; లేకపోతే అది పిరికితనంకింద జమ అవుతుంది. నా భర్తకు అంత మరీ మంచిగా ఉండకుండా ఉండే మగసిరి ఉంటే బాగుండేదని నాకు అనేకసార్లు అనిపించింది.

మా తోడికోడలు ఉత్తమ స్త్రీ లక్షణాలు ప్రదర్శించడానికేమంత పాటు పడలేదు. ఆమె మాటలూ, హాస్యమూ, సరసమూ ఆక్షేపణీయంగా ఉండేవి. కాని ఆమెకు అదుపేమిటి? అదే వంశాచారం. నా భర్త మరీ నీతిపరుడుగా ఉన్నందు కామెకు కన్నెర్రగా ఉండే దనుకుంటాను. ఆమె మటుకు తనలోని లోపాలకుకన్న, తన దురదృష్టానికే ఎక్కువగా బాధపడేది.

* * * *

నేను ఘోషా విడిచి బయటికి రావాలని నా భర్తకు మహా ఉండేది.

"బయటి ప్రపంచంతో నా కేం పని?'' అని ఒకనా డాయన్ని అడిగాను.

"బయటి ప్రపంచానికి నీతో పని ఉండరాదా?" అన్నా డాయన.

"ఇంతకాలమూ ప్రపంచానికి నేను లేకుండా జరగలేదా? ఇంతలో నాకోసం తపించిపోదులెండి."

"ప్రపంచం చావనీ, నేను నా గురించి ఆలోచిస్తున్నాను."

''మీ గురించిన దేమిటి?"

"ఆ బయటి ప్రపంచంలో నాకు నువ్వూ, నీకూ నేనూ ఉండాలి కద."

"ఇంట్లో మన మధ్య ఉన్న ప్రేమలో లోపం ఉందా?"

"ఇక్కడ నేనే నీకు సర్వస్వమూ ఐతిని. నీ కేమున్నదీ, ఏం కావలిసిందీకూడా నీకు తెలీదు ''

"ఇలాటి మాటలు సహించలేను."

"బయటికి వచ్చి వాస్తవం తెలుసుకో. ఇంటి బాధ్యతలూ, ఇంటి అనవాయితీలూ, ఇంటి చాకిరీ–వీటి కోసం కాదు నువ్వు పుట్టింది. వాస్తవప్రపంచంలోకి అడుగు పెట్టి మనం ఒకరి నొకరు గుర్తించగలిగినప్పుడే మన ప్రేమ వాస్తవ మవుతుంది."

''ఇక్కడ మనం ఒకరి నొకరు సరిగా గుర్తించుకోలేకపోయినట్టయితే మీ రన్నది నిజమే. నా మటుకు కనబడదు."

"లోటు నాకే కనబడుతున్నదనుకుందాం. దాన్ని సరిచెయ్యడానికి నువు సాయపడగూడదా ?"

ఈ ధోరణిలో ఎన్నో సంభాషణలు జరిగాయి. నా భర్త ఈ ధోరణిలో మాట్లాడటం నాకు నచ్చేది కాదు. కాని నేను జనానా విడిచి రాననటానికి గల కారణం వేరు. ఆయన ముత్తవతల్లి అప్పటి కింకా జీవించే ఉంది. ఆమెకు సయించని ఇరవయ్యో శతాబ్ది వాతావరణంతో నా భర్త ఇల్లంతా నింపేశాడు. ఆమె ఓర్చి ఊరుకుని వున్నది. రాజాలకోడలు ఇల్లు దాటి బయట అడుగు పెట్టినా ఆమె సహించి ఉండేదేగాని ఆమెకు బాధకలించవలసినంత అగత్యం నా కేమీ కనబడలేదు. "పంజరపు పక్షి" అన్నమాట పుస్తకాలలో చదివాను. ఈ నా పంజరం, నాకు కావలసిన దెంతో ఉండటంచేత, ఇది నాకు విశ్వమంత పెద్దదిగా తోచేది — కనీసం అప్పట్లో.

నా భర్తముత్తవతల్లి నన్ను ప్రాణంగా చూసుకునేది. ఆ ఇంటి పురుషులందరూ ఏ అగ్నిలో శలభాల్లాగా నాశన మయారో, ఆ అగ్నిని చల్లార్చి, నేను నాభర్తను ఉద్ధరించానని ఆవిడ నమ్మకం.

ఆమె చనిపోయాక నాభర్త నన్ను కలకత్తా తీసుకుపోయి, అక్కడ కాపరం పెట్టాలనుకున్నాడు. కాని నా కది సాధ్యంకాలేదు. ఇది నాయిల్లు. ముసలావిడ ఎనిమిదోఏట ఈ ఇంట అడుగుపెట్టి, డెభ్భై తొమ్మిదేళ్ళ వయసులో చనిపోయేదాకా ఈ ఇంటిని కాపాడింది. ఆమె అశ్రువులతో ఈ ఇల్లు పవిత్రమైంది. దీన్ని విడిచిపెట్టిపోయి కలకత్తాదుమ్ములో ఎలా బతకను ?

నేను కలకత్తా వెళ్ళితే నా తోడికోడలు ఈ ఇంట యథేచ్ఛగా రాజ్యం ఏలుతుందనీ, మా జీవితశాఖలు విస్తరిస్తాయనీ నాభర్త ఉద్దేశం. అదే నా కిష్టంలేదు. నన్నూ, నా సుఖాన్నీచూసి కళ్ళలో నిప్పులు పోసుకున్న మనిషికి ఇంటిపెత్తనం బహూకరించడమా? నేను తిరిగివచ్చాక నా స్థానం నాకు తిరిగి దక్కేనా ?

"ఎందుకు నీ కాస్థానం? అంతకన్న విలవైన వెన్నోఉన్నాయి," అని నాభర్త. మగవాళ్ళ కిలాటి విషయా లర్థంకావు; వాళ్ళు ఆడవాళ్ళను అనుసరించడమే మంచిది — అప్పట్లో నా కలా అనిపించింది.

నా భర్త నన్ను కలకత్తా రమ్మని నిర్బంధించలేదు — తనకు నిర్బంధించే అధికారం ఉన్నందుననే ఆయన అలా చెయ్యలేదు.

* * * *

బెంగాలులో స్వదేశీ ఉద్యమం వెల్లువలాగా వచ్చిపడింది. అది ఎలా వచ్చిందో, ఏం జరగబోతున్నదో ఎవరికీ తెలీదు. దీని మూలానే నాకు బయటి ప్రపంచమంటూ ఒకటి ఉన్నసంగతి గుర్తుకొచ్చింది. దూరంనుంచి ఏదో పిలుపు వినిపించి నా హృదయంలో నాటుకున్నది. కాని తాత్పర్యం నాకంత స్పష్టంగా తెలియదు.

నా భర్త కాలేజీచదువులో ప్రవేశించినదిమొదలు దేశవాళీ వస్తువుల ఉత్పత్తికొరకు పాటుపడుతూవచ్చాడు. ఆ ప్రయత్నంలో



చాలానష్టం వచ్చింది. దేశీయ పరిశ్రమలు పునరుద్ధరించాలంటే ఒక సొంతబాంకు ఉండాలి. అందుకని ఆయన ఒక చిన్న బాంకు స్థాపించి, ప్రజలకు పొదుపు బోధించి, వారిడబ్బును ఆకర్షించడానికని హెచ్చువడ్డీ ఆశ చూపాడు. ఆ వడ్డీతో బాంకు దివాలా తీసింది.

మా ఎస్టేటుఉద్యోగులు కంగా రెత్తారు. ఇంటోవాళ్ళంతా నాభర్తను ఆడిపోశారు — ఆయన ముత్తవతల్లి తప్ప. ఆవిడ ఆయనను వెనకేసుకొచ్చి, మగవాళ్ళన్నాక డబ్బు తగలెయ్యకుండా ఉంటారా ? ఈ ఎస్టేటుకు ఎన్ని జప్తు లొచ్చాయో నాకు తెలుసు. నీ మొగుడు డబ్బు తీసుకుపోయి మరోకందుకు తగలెయ్యనందుకు సంతోషించు," అని నాతో అన్నది.

నాభర్త చేసే దానధర్మాలకు అంతులేదు. కొత్తరకం మగ్గమో, వడ్లమరో కనిపెడుతున్నా నన్నవాడికి ఎంతైనా ధనసహాయం లభించేది. స్వదేశీ పేరు చెప్పి సందీప్‌బాబు నా భర్తదగ్గిర అంతులేనిడబ్బు రాబట్టి, సొంతానికి వాడుకునేవాడు. చిత్ర మేమంటే, వారికి ఎందులోనూ ఏకాభిప్రాయం ఉండేదికాదు.

స్వదేశీ ఉద్యమం నా రక్తంలోకి ప్రవేశించగానే నాకు విదేశీ వస్త్ర దహనం చెయ్యాలని పుట్టింది.

"నీకు అక్కర్లేకపోతే విదేశవస్త్రాలు కట్టకు. వాటిని తగలబెట్టటం దేనికి ? నిర్మాణం చెయ్యాలిగాని, నిర్మూలనమాత్రమేమిటి ?" అన్నాడు నా భర్త.

నా తలలోకి మహాకఆలోచన కొత్తగా వచ్చింది: మిస్ గిల్బీ విదేశీయురాలు; ఆమెను సాగనంపాలి.

నేనీమాట అన్నప్పుడు నాభర్త చాలా నొచ్చుకుని, "ఇంత



కాలం స్నేహం చేశాక నీ కావిడ విదేశీపేరు పట్టిస్తున్నదా?" అన్నాడు.

నేను నా అభిప్రాయం మార్చుకుని ఆమెను ఉండనిద్దా మనుకున్నాను. కాని ఒకఆదివారంనాడు ఆమె చర్చికి పోతుండగా, మమ్మల్ని ఆశ్రయించుకు బతికే నరేన్ అనే కుర్రా డేదో అవమానంగా మాట్లాడాడని మిస్ గిల్బీ తానే వెళ్ళిపోయింది. ఆమె కళ్ళనీళ్లు పెట్టుకుని నాకు వీడ్కోలు చెప్పినప్పుడు నాహృదయం కరగలేదు. పాపం, పనివెధవమీద అభాండాలు వేసింది. నాభర్త మిస్ గిల్బీని బండిలో స్టేషనుదాకా దిగబెట్టడం కూడా నాకంత నచ్చలేదు. ఆయన ఆకారణంగా అపవాదుకు గురి అయినప్పుడు అంతేకావా లనికూడా అనిపించింది నాకు.

పాపం, నరేన్ మిస్ గిల్బీని ఎలా అవమానించాడో నాకు తెలీదు; నాకు పట్టలేదుకూడా. కాని నా భర్త వాణ్ణి పంచాయతీకి పెట్టినప్పుడు నేను నాభర్త ప్రవర్తనకు మొట్టమొదటిసారిగా సిగ్గుపడ్డాను. ఎవరో ఇంగ్లీషుదాన్ని నరేన్ అవమానించటం తప్పా? కాదే!

నిజానికి నా భర్త స్వదేశీ ఉద్యమం అవలంబించినవాడే. కాని "వందేమాతరం" ప్రభావం ఆయనపైన చాలినంతలేదు.

"నాకు దేశాభిమానం లేకపోలేదు. కాని నేను హెచ్చుగా ఆరాధించేది ధర్మాన్ని. దేశాన్ని దేవతలాగా ఆరాధిస్తే అది శాపమై తగులుతుంది," అన్నా డాయన.

* * * *

మా ప్రాంతాలకు సందీప్‌బాబు తన అనుచరులతో సహా స్వదేశీ ఉద్బోధించ వచ్చాడు. గుడి ఆవరణలో పెద్ద మీటింగు ఏర్పాటుచేశారు. తెరవెనక స్త్రీలం కూర్చున్నాం. "వందేమాతరం" నినాదాలు దగ్గిరికి వస్తున్నకొద్దీ నా శరీరం పులకరించింది. ఒక్కపెట్టున యువకుల సమూహం కాషాయవస్త్రాలు ధరించి, పాదరక్షలు లేకుండా ఆలయ ప్రాంగణంలోకి ఉప్పెనలాగా వచ్చిపడ్డారు. జనంతో కిక్కిరిసిన ఆ ఆవరణలోకి పది పన్నెండుమంది యువకులు సందీప్‌బాబును కుర్చీలో మోస్తూ తీసుకొచ్చారు.

"వందేమాతరం! వందేమాతరం! వందేమాతరం!" ఆకాశం పిక్కటిల్లింది.

అదివరకు నేను సందీప్‌బాబు ఫొటో చూశాను. మనిషి అందంగానే ఉంటాడు. కాని అతని ముఖంలో నాకు నచ్చని దేదో ఉన్నది; అందుకే నాభర్త సందీప్‌బాబుకు అడిగినంతా ఇవ్వటం నా కిష్టంలేదు. డబ్బుఖర్చని బెంగకాదు — స్నేహం అడ్డం పెట్టుకుని అతను నా భర్తను మోసం చేస్తున్నాడని!

కాని ఆ సాయంకాలం ఆయనఉపన్యాసం జనాన్ని ఉర్రూతలూగించేస్తుంటే నా కళ్ళకు ఆయన మారిపోయినట్టు కనిపించాడు; దేవదూత అనిపించాడు. నేను మధ్యలో పరదా తొలగించి ఆయనను చూడసాగాను. ఒకసారి ఆయన కళ్ళు నాకేసి మెరిశాయి. కాని నాకేమీ అనిపించలేదు. నేనప్పుడు రాజాల ఇంటిదాన్ని కాను, వంగస్త్రీలకు ప్రతినిధిని — ఆయన వంగవీరుడు.

నాకేసి చూసిన అనంతరం ఆయన ఉపన్యాసంలో మరింత పదునూ, గర్జనా ధ్వనించాయి.

ఆరోజు ఒక కొత్త ఆనందమూ, ఒక కొత్త గర్వమూ నన్నావేశించాయి. నాలో చెలరేగిన ఉద్రేకంలో సందీప్‌బాబుకోసం ఎలాటి త్యాగమైనా చెయ్యగల ననిపించింది.

ఆరాత్రి నా భర్త ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, నాలోని గానానికి ఆయన నోట ఎలాటి అపశ్రుతి వస్తుందో నని హడలిపోయాను. ఏమైనా ఆయన అనిఉంటే నేను తప్పక ఆయనను ధిక్కరించి ఉండేదాన్ని. కాని ఆయన ఏమీ అనలేదు. అదికూడా నాకు చిరాకే తెప్పించింది. సందీప్‌బాబు తన కళ్ళు తెరిపాడని ఆయన అని ఉండవలసింది.

"సందీప్‌బాబు ఎన్నా ళ్ళుంటున్నారు?" అని అడిగాను.

"రేపు తెల్లవారుజామున రంగపూర్ పోతున్నాడు."

"రేపే వెళ్ళాలా?"

"అక్కడ మీటింగు ఏర్పాటయిఉంది. ఏం?"

"ఏమీలేదు. ఆయనను భోజనానికి పిలిచి స్వయంగా వడ్డన చేద్దా మని."

నా భర్త ఆశ్చర్యపడ్డాడు. ఆప్తస్నేహితులు భోజనానికి వచ్చినప్పుడుకూడా, ఆయన నన్ను వారి ఎదటికి రమ్మంటే నేను రాలేదు. అయినా నాకేసి ఇప్పుడు చూసిన వింతచూపు నాకర్థం కాలేదు. ఒక్కసారిగా నాకు సిగ్గు ముంచుకొచ్చి, "వద్దులెండి, అది సాధ్యంకాదు," అన్నాను.

"ఎందుకు సాధ్యంకాదు. నేను స్వయంగా అతన్ని ఆహ్వానిస్తాను. ఏమాత్రం వీలున్నా రేపు భోజనానికి ఉండిపోతాడు," అన్నాడు నా భర్త.

ఆయన అన్నట్టు సాధ్యమే అయింది.

ఉన్నమాట చెప్పేస్తాను. నన్ను బ్రహ్మ అద్భుత సౌందర్యవతిగా సృష్టించనందుకు అతగాణ్ణి తిట్టుకున్నాను. ఎందుకంటే, సౌందర్యమే ప్రతిభ. సందీప్‌బాబుకు నాలోని మాతృభూమి శక్తి కనిపిస్తుందా? లేక నన్ను సాధారణ కుటుంబినిగా భావిస్తాడా?

ఆ ఉదయం నేను నా జుట్టుకు అగరుధూపం వేసి, వదులు ముడి వేసుకుని, అందంగా ఎర్ర సిల్కు రిబ్బను చుట్టాను. జరీ అంచు తెల్లచీర కట్టాను, జరీఅంచు గల పొట్టిచేతుల మజిలిను రవికె తొడిగాను. నేను ధరించినవి అతి సాధారణమైన దుస్తులే అయినా, మా తోడికోడలు నన్ను చూసి ఆగిపోయి, మూతి బిగించి, నన్ను ఎగాదిగా చూసి, ఒక మర్మగర్భితమైన నవ్వు నవ్వింది. ఎందుకని అడిగితే. "నీ షోకు చూసి ఆనందిస్తున్నాను," అన్నది.

"ఆనందించటానికేమున్నది?" అన్నాను ఆందోళనపడుతూ.

"గొప్పగా ముస్తాబయావు. మెడ ఇంకా కిందిగా ఉండే ఇంగ్లీషుజాకెట్టు తొడుక్కున్నట్టయితే అద్భుతంగా ఉండేది," అని ఆమె పట్టరానంత నవ్వును బలవంతాన అణచుకుంటూ వెళ్ళిపోయింది.

నాకు చచ్చే కోపం వచ్చింది. అన్నీ తీసేసి మామూలు బట్టలు వేసుకుందా మనుకున్నాను. ఎందుకో అలా చేశానుకాను.

భోజనాల దగ్గిర వడ్డన సమయంలోనే ఎదటపడదా మనుకున్నాను. కాని భోజనాలు వేళకు సిద్ధం కాలేదు. అతిథికి పరిచయం చేసేందుకు నా భర్త నాకు కబురుపెట్టాడు. సందీప్‌బాబు ముఖంలోకి చూడాలంటే చచ్చే సిగ్గయింది. ఎలాగో దాన్ని నిగ్రహించుకుని. "భోజనానికి ఆలస్య మయిపోతోంది," అని విచారం వెలిబుచ్చాను.

అతను సాహసంగా వచ్చి నా సరసనే కూర్చుని, "ఏదో ఒక భోజనం రోజూ ఉండేదే: లక్ష్మి మాత్రం తెరవెనక దాగుంటుంది. ఈనాడు లక్ష్మే సాక్షాత్కరించింది గనక భోజనం తొందరలేదు," అన్నాడు.

అతను ఉత్తప్పుడుకూడా ఉపన్యాసం ఇచ్చినట్టే ధాటీగా మాట్లాడతాడు. నదురూ, బెదురూ లేని మనిషి. అతని కలుపుగోలుతనాన్ని ప్రశ్నించే అవమానం కలగాలన్నట్టుంటాడు.

ఆయనముందు నేను బెదురుగొడ్డులాగా మాటచొరవ లేనిదానిలాగా అయిపోతున్నా నని చచ్చే భయం వేసింది.

భోజనా లయాక నేను వెళ్ళిపోబోతుండగా సందీప్‌బాబు మహా ధైర్యంగా నా దారికి అడ్డు నిలిచి, "నేను ఉండిపోయింది భోజనం కోసం కాదు, నీ ఆహ్వాన కారణంగా. ఇలా పారిపోతే అతిథి కన్యాయం చెయ్యట మవుతుంది," అన్నాడు.



ఈ మాటలు అనుచితమైన వనిపించి ఉండవలసిందే. కాని అతను తీరు అలాటి భావం కలగనివ్వలేదు. ఇంతకూ అతను నా భర్తకు ఆప్తమిత్రుడు; నే నతని సోదరిలాటిదాన్ని.

ఇంత ఆత్మీయత నెలా స్వీకరించడమా అని మథనపడుతున్న సమయంలో నా భర్త నన్ను ఆదుకుంటూ, "భోజనం చేసి మళ్ళీ రాగూడదూ?" అన్నాడు.

"వస్తానని మాట ఇస్తేనేగాని వెళ్ళనివ్వం," అన్నాడు సందీప్‌బాబు.

నేను చిన్నగా నవ్వి, "వస్తాను," అన్నాను.

"ని న్నెలా నమ్మటం? నిఖిలుడు పెళ్ళి చేసుకుని తొమ్మిదేళ్ళయినా ఇవాళదాకా నా కళ్ళ పడకుండా తప్పించుకున్నావు. మరో తొమ్మిదేళ్ళకుగాని మళ్ళీ కనిపించకపోతే మనం కలుసుకునే అవకాశం ఉండదు,'' అన్నా డతను.

"ఎందు కలా?"

"జాతకరీత్యా నేను అల్పాయుష్కుణ్ణి. మా వంశంలో ఎవరూ ముప్ఫైదాటి జీవించలేదు. నా కిప్పు డిరవైయేడేళ్ళు.''

''దేశమంతా ఇచ్చే దీవెనలముందు గ్రహాలబలం ఏపాటి?" అన్నాను. ఈమాట అనేటప్పుడు నా గొంతులో ఆందోళన ధ్వనించి ఉండాలి.

నేను దేశదేవత ననీ, దేశంవాళ్ళ దీవెనలు నా నుంచి రావాలనీ, అవే తనకు రక్షరేకనీ అత నన్నాడు. మాటలలోపడి అతను తన అజీర్తివ్యాధిని గురించి చెప్పాడు. దానికి అలోపతీ, హోమియోపతీ మందులు పనిచెయ్యలేదట, నాటుమందులే పని చేశాయట.

"దేవుడు నా రోగాలనుకూడా దేశవాళీ మందులతో నయమయేట్టే ఏర్పాటు చేశాడు, చిత్రం!" అన్నా డతను.

"నీ అలమారులో మూడు అరలనిండా ఇంగ్లీషు మందులే ఎందు చేతనో?" అన్నాడు నా భర్త కలిగించుకుని.

"ఏం చెయ్యమన్నావు? ఆధునిక నాగరికత నాకు విధించిన శిక్ష ఆ మందులు; నేను కోరినవి కావు," అన్నాడు సందీప్‌బాబు.

నా భర్తకు ఇలాటి అత్యుక్తులు సరిపడవు. కాని అత్యుక్తులు మానవతాచిహ్నం. పశుపక్ష్యాదులుమాత్రమే సత్యానికి కట్టుబడతాయి.

నేను లోపలికి వచ్చేస్తుంటే మా తోడికోడలు ఒక కిటికీ మరుగున నిలబడి కనబడింది.

"పొంచి వింటున్నాను,'' అన్న దామె నన్ను చూసి.

ఆదరాబాదరా నాలుగుమెతుకులు నోట కొట్టుకుని నేను తిరిగి వచ్చాను. "మేము నీ ఆకలి పాడుచేసినట్టున్నాం," అన్నాడు సందీప్‌బాబు. నేను అన్నప్రకారం తిరిగి రావటం మహాభాగ్య మని కూడా అన్నా డతను.

నే నేమీ జవాబు చెప్పకుండా, ముళ్ళమీద కూర్చున్నట్టుగా సోఫా చివర కూర్చున్నాను. సందీప్‌బాబు పనిపెట్టుకుని నా భర్తతో వాదన పెట్టుకున్నాడు. అతను వాదించడంలో సిద్ధహస్తుడు. నే నెదుట ఉన్నప్పుడల్లా అతను ఏదో ఒకవాదనలోకి దిగడం నేను దరిమిలా చాలాసార్లు గమనించాను.

దేశభక్తిలో భావనకు స్థానం ఉండాలా, కూడదా అన్నదాన్ని గురించి ఇద్దరూ వితర్కించుకున్నారు. భావనకు స్థానం ఇవ్వవచ్చును గాని, దానితోనే సరిపెట్టుకోకూడ దన్నాడు నా భర్త.

"నా దేశంయొక్క నగ్నరూపం నే నెరుగుదును. దేశభక్తి ప్రబోధాలతో దాన్ని వశీకరణ చెయ్యటమంటే నీకు భయమూ, సిగ్గూకూడాను," అన్నా డాయన.

"నా దేశమే నాకు దేవుడు. దేవుడు మనిషిలోనూ, దేశంలోనూ కూడా సాక్షాత్కరిస్తాడు సందీప్‌బాబు.

అలాటప్పుడు మనిషికీ, దేశానికీ మధ్య తేడా లెంచడ మెందు కన్నాడు నా భర్త. ద్వేషించడంకూడా ఆరాధనే నన్నాడు సందీప్. అయితే దేశద్రోహులుకూడా భగవంతుణ్ణి ఆరాధించేవారేగదా; దేశభక్తి ప్రబోధాలు దేని కన్నాడు నా భర్త.

"చూడు, నిఖిల్, ఇదంతా శుష్కవాదన. ఉద్విగ్నత అంటూ ఉంటుం దని గ్రహించలేవా?" అన్నాడు సందీప్.

"అన్యాయాన్ని ధర్మ మనీ, పాపాన్ని నైతికాదర్శ మనీ అన్నప్పుడు నాకు కలిగేది ఉద్విగ్నతే. నేను దొంగతనం చెయ్యలేను. కారణం బుద్ధివాదంకాదు; నాకుండే ఆత్మగౌరవం, ఆదర్శాలపై అభిమానం!" అన్నాడు నా భర్త.

నేను ఊరుకోలేకపోయాను; "చరిత్ర చూసినట్టయితే, ఇంగ్లండూ, ఫ్రాన్సూ, జర్మనీ, రష్యా, అన్నీ స్వార్థంకొరకు దొంగతనాలు చేశాయి." అన్నాను.

"చరిత్ర ఇంకా ముగియలేదు. అందు కా దేశాలు సంజాయిషీ ఇచ్చుకోవాలి; ఇప్పు డిచ్చుకుంటూనే ఉన్నాయి." అన్నాడు నా భర్త.

"ఆపని మనమూ చెయ్యొచ్చుగా? ముందు దొంగిలించి మన ఖజానాలు నింపుకుందాం. కొన్ని శతాబ్దాల అనంతరం సంజాయిషీ ఇచ్చుకోవలసివస్తే ఇచ్చుకుంటే సరిపోయె," అన్నాడు సందీప్.

"రోమ్ తన పాపాల కెలా ప్రాయశ్చిత్తము అనుభవించిందో చూసినవారులేరు. అది చివరదాకా అంతులేని వైభవంతో తులతూగుతున్నట్టే కనిపించింది."

నా భర్త తనమిత్రులతో వాదించడం నేనిదివరకు వినలేదు. నాతో వాదించేటప్పుడు న న్నెన్నడూ ఇరకాటంలో పెట్టలేదు — నా మీది ప్రేమచేత. కాని ఆయన ఎంత చాకచక్యంగా వాదించగలడో ఇవాళే నేను గమనించాను.

అయినా ఆయన వైఖరి నాకు నచ్చలేదు. కాని ఆయన కెల సమాధానం చెప్పాలో నాకు తెలియదు. ఇంతలో సందీప్‌బాబు న కేసి తిరిగి, "నీ అభిప్రాయ మేమిటి?" అని అడిగాడు.

"నాకీ ధర్మసూక్ష్మాలు తెలీవు. నేను దేవతను కాను, మనిషి నాలో స్వార్థం ఉంది. నా దేశసంపదను దొంగిలించైనా సంపా స్తాను. నాలో ఆగ్రహం ఉంది. దేశంకోసం ఆగ్రహిస్తాను అవసరమైతే హత్యలూ, రక్తపాతమూ చేస్తాను. నాదేశం నా ఒకవ్యక్తిరూపంలో సాక్షాత్కరించాలి — మాత, దేవి, దుర్గ ఆమెకోసం బలులుపెట్టి, రక్తపుమడుగులు చేస్తాను."

సందీప్‌బాబు చివాలున లేచి, చేతులెత్తి, "హుర్రా!" అని అరి మాట మార్చుకుని, "వందేమాతరం!" అని కేకపెట్టాడు.

నా భర్తముఖాన విషాదచ్ఛాయ తోచింది. ఆయన నాతో అమిత మృదువుగా, "నేనూ మనిషినేగాని, దేవతనుకాను. అందుచేతనే నాలో ఉండే కుళ్ళుకు దేశమాత రూపం కల్పించలేను — అసంభవం!" అన్నాడు.

"స్త్రీ హృదయంలో సత్యం ఎలా రక్తమాంసాలు సంపాదించుకుంటుందో చూశావా, నిఖిల్? నిజమైన క్రౌర్యం స్త్రీకే తెలుసు. ఈ దేశాన్ని స్త్రీలే ఉద్ధరించబోతున్నారు చూడు, నిఖిల్. ధర్మసందేహాలకూ, దయా దాక్షిణ్యాలకూ ఇది సమయంకాదు. మనం పాపంలో ఓలలాడాలి, విధ్వంసనానికి పూనుకోవాలి," అన్నాడు సందీప్.

అన్నిదేశాలవాళ్ళూ అనాదిగా ఆరాధించే ఆదర్శాలను అతను ఒక్కముక్కతో లాగి పారేశాడు. నా శరీరమంతా ఒక్కసారిగా జలదరించింది. అతను అదేధోరణిలో మాట్లాడుకుపోతూంటే నా భర్త లేచి నిలబడి, అతనిభుజాన్ని మెల్లిగా తట్టి, "సందీప్, చంద్రనాథబాబు వచ్చారు," అన్నాడు.

నేను ఉలికిపడి, వెనక్కు తిరిగి చూసేసరికి వాకిలివద్ద ఒక వృద్ధుడు ప్రశాంత వదనముతో నిలబడి కనిపించాడు. నాభర్త నాతో

రహస్యంగా, "ఈయనే మా గురువుగారు. ఈయనమాట నీకు చాలాసార్లు చెప్పాను." అన్నాడు.

నే నావృద్ధుడి పాదధూళి తీసుకున్నాను.

"తల్లీ, ఈశ్వరుడు నిన్నెప్పుడూ కాపాడుగాక!" అని ఆయన నన్ను ఆశీర్వదించాడు. అలాటి ఆశీర్వచనం నా కా సమయంలో అత్యవసర మనిపించింది.



## నిఖిలుడు చెప్పిన కథ

భగవంతుడు నా కేపరీక్ష పెట్టినా నిలబడగలనని ఒకప్పు డనుకునేవాణ్ణి. అలాటిపరీక్ష నాకిప్పటిదాకా రాలేదు. ఇప్పుడువచ్చింది. తీరా వచ్చాక నేను నిలబడగలనా అని సంశయంగా ఉంది. నా గుండెలో ఒక ముల్లు గుచ్చుకున్నది. నిత్యకృత్యాలలో మునిగి ఉన్నప్పుడు కూడా అది నన్ను బాధిస్తున్నది. ఏమి టిది?

నా మన స్సెంత సున్నితంగా తయారయిందంటే గడచిన సుఖాన్నిగురించి ఆలోచించితే అందులోని అవాస్తవికతకు నా గుండె లవిసిపోయి, అందుచేత కలిగే అవమానమూ, బాధా అణచడం సాధ్యంకాకుండాఉన్నది. నా హృదయం వేయికళ్లు చేసుకుని చూడరానివాటిని చూస్తున్నది. తొమ్మిదేళ్ళ నా యౌవనం వట్టి భ్రమగా పరిణమించి, నా జీవితం నిరర్థకం చేసేసింది.

ప్రజ్ఞతో పెనుగులాడి ఏం లాభం? లోపం నాలోనే ఉండాలి. పురుషులలో అర్థరహితమైన బలాత్కారగుణమే స్త్రీలను ఆకర్షిస్తుందేమో, కాని బలమంటే కేవలమూ కండరాలశక్తి కాదే. దుర్బలుణ్ణి అణగార్చడానికి బలం వెగకాడవద్దా?

ఇప్పటిదాకా విమల నాలుగు గోడలమధ్య తయారైనది. ఆమె నాపట్ల చూపిన ప్రేమ నిజంగా హృదయంనుంచి వచ్చినదా, లేక నేను కొళాయితిప్పి నీరు తీసుకున్నట్టు తీసుకున్నానా?

విమల పూర్తిగా వికసించి తనలోని నిజాన్నీ, శక్తులనూ వర్ధిల్లజేసుకోవాలని ఆశించాను. కాని అలా వాస్తవ పరిణతిచెందిన వ్యక్తిముందు సాంప్రదాయిక హక్కులను సమర్థించడానికి వీలుండదన్న సంగతి మరిచాను. ఎందుకు మరిచాను? ప్రేమలో గుడ్డి విశ్వాసంచేత. నగ్నసత్యాన్ని తిలకించేస్థయిర్యం నాలో ఉన్నదని గర్వించాను. కోరి పరీక్ష తెచ్చుకున్నాను; కాని గెలుస్తా ననుకున్నాను.

బలప్రయోగం నా దృష్టిలో దౌర్బల్య గుణమన్న సంగతి విమల గ్రహించలేక పోయింది. దుర్బలుడు న్యాయంగా నడుచుకోలేడు; తాను కోరిన ఫలితాలను అన్యాయమైన అడ్డుదార్ల సాధిస్తాడు. విమలకు ఓరిమి పట్ల ఓరిమి లేదు. పురుషులలో గండ్రతనమూ, క్రోధమూ, అక్రమమూ ఆమె ప్రేమిస్తుంది. తనకు బహిఃప్రపంచంలో స్వేచ్ఛ లభించాక విమల నిరంకుశత్వంపైన గల వ్యామోహమునుంచి బయటపడ గలుగుతుందని ఆశించాను. ఆమెకు జీవితంలో ఉద్వేగం ఇష్టం. ప్రశాంతజీవనం రుచించదు. నేను అన్ని పనులూ శాంతంగా చేస్తాను. అది నా దౌర్బల్యమని ఆమె ఉద్దేశం. నేను "వందేమాతరం" అని వెర్రిగా కేకలువేస్తూ అటూ ఇటూ పరుగులు తీయడంలేదని నా మీద ఆమెకు కోపం.

ఆ మాటకు వస్తే నేను కూడా తమ వేలంవెర్రిలో చేరనందుకు అందరూ నాపైన అలిగారు. నేనేదో బిరుదు పొందాలనుకుంటున్నాననో, లేక పోలీసులంటే భయమనో వారి అనుమానం. నే నేదో దొంగచిత్తు వేస్తున్నానని పోలీసుల అనుమానం. నా అనుమానమేమిటంటే, తమ దేశాన్ని ప్రేమించటం కోసం ఉద్రేకం తెచ్చిపెట్టుకునేవారికి దేశంమీద కన్న ఉద్రేకంమీదనే హెచ్చు ప్రేమ అని.

ఆ మధ్య ఒకనాడు సందీపుడు నాలో చిత్తవికాసం తక్కువ అని అంటే, విమల అతన్ని బలపరిచింది. నేను ఆత్మసమర్థన చేసుకోలేదు; వాదించి గెలవడంలో సుఖం లేదు. ఆమె నాతో ఏకీభవించకపోవడానికి కారణం తెలివితేటలు తక్కువై కాదు— అది మా ప్రకృతులలో ఉండే వ్యత్యాసం.

ఇటీవల సందీపుడిలో ఒకవిధమైన మొరటుతనమూ, లోభమూ గమనిస్తున్నాను. అతని మతంలో అనేక భ్రమలూ, అతని దేశభక్తిలో ధూర్తత్వమూ ఏర్పడడానికి అదే కారణం. అతను తెలివిగలవాడే గాని, హీనస్వభావుడు. తన నీచకామనలకు పెద్దపేర్లు పెడతాడు. తన కోరికలను సంతృప్తి పరచడంలాగే, ద్వేషించి సంతృప్తి చెందడం కూడా అతనికి అవశ్యకం. వెనకటిరోజుల్లో విమల అతని ధనదాహం గురించి నన్ను హెచ్చరించింది. కాని దాన్ని పట్టించుకోవడం నాకే సిగ్గనిపించింది.

సందీపుడి దేశాభిమానం అతని స్వార్థానికి మారు పేరు అని

ఇప్పుడు విమలకు తెలియజెప్పడం తేలిక కాదు. ఆమె అతన్ని ఆరాధించే తీరు చూస్తే, అతన్ని గురించి ఆమెతో ఏమి చెప్పడానికి ప్రయత్నించినా నా నోట అసూయకొద్దీ అబద్ధాలు వెలువడతాయేమోనని భయంగా ఉంది......

మా గురువుగారిని ముప్పై ఏళ్లుగా ఎరుగుదును. ఆయన అన్ని ద్వంద్వాలకూ అతీతుడు. మా వంశంలో పుట్టిన నన్ను ఆయన ప్రభావమే కాపాడింది.. ఆ రోజు ఆయన మా యింటికి వచ్చినప్పుడు, "సందీపుణ్ణి ఇక్కడ ఇంకా ఉంచనవసరం ఉందా?" అని అడిగారు. ఆయన ఎలాటి చెడునైనా సునిశితంగా పసిగట్టగలరు. అంతేగాక, నేనంటే ఆయనకు అమితమైన వాత్సల్యం.

టీ తాగేటప్పుడు సందీపుడితో, "రంగపూరునుంచి ఉత్తరం ఇంతకు ముందే వచ్చింది. నేను నిన్నిక్కడ బంధించి ఉంచుకున్నానని ఆక్షేపిస్తున్నారు. అక్కడికెప్పుడు పోతున్నావు?" అని అడిగాను.

టీ పోస్తున్న విమల ముఖం ముడుచుకున్నది. ఆమె సందీపుణ్ణి ప్రశ్నార్థకంగా చూసింది.

"అటూ ఇటూ తిరగడం వృథాశ్రమే నేమో ననిపిస్తున్నది. ఒక కేంద్రం ఏర్పరుచుకుని పని చేస్తే మరింతగా ఫలితం ఉంటుందేమో," అన్నాడు సందీపుడు. అతను విమల అభిప్రాయం అడిగాడు.

విమల కొంచెం సందేహించి, "రెండూ మంచి పద్ధతు లనే తోస్తుంది. ఏ పద్ధతి మీకుతృప్తికరమని తోస్తే అదే అవలంబించవచ్చు," అన్నది.

ఏ ఒక్కదానినుంచీ తనకు ఉద్దీపనం కలగకపోవడం చేతనే సంచారం చేసి ప్రజలను ఉత్తేజపరుస్తూ, దీనినుంచి తాను ఉత్సాహం పొందుతున్నానని సందీపు డన్నాడు. ఇవాళ అతనికి విమలనుంచి దేశసందేశం వినిపించిందట. "నువే ఇక మా తేనెపట్టుకు రాణీవి. నిన్ను ఆశ్రయించి, నీనుంచి ఉద్దీపన పొందుతూ, నిన్ను కేంద్రంగా పెట్టుకుని మేము పని చేస్తాం," అన్నా డతను విమలతో.

విమల గర్వం కూడిన లజ్జతో కందిపోయింది. టీ పోసేటప్పుడామె చెయ్యి వణికింది.

మరొకనాడు మా గురువుగారు, "మీ రిద్దరూ గాలి మార్పుకు డార్జిలింగు పోగూడదూ? నీ ఆరోగ్యం బాగున్నట్టు లేదు. నిద్ర సరిగా పట్టుతున్నదా?" అని అడిగారు.

విమలకు హిమాలయాలంటే ఇష్టం. కాని పోదామా అంటే రా నన్నది... దేశంకోసమయి వుంటుంది.

నేను తొందరపడరాదు. ఇంటినుంచి బయటికి వచ్చే దారి ప్రమాదాలతో కూడుకున్నది. ఈ స్వాతంత్ర్యానికి ఆమె అలవాటు పడేదాకా నా స్థానం ఏమిటో తేలదు. బయటి ప్రపంచంలో నాకు స్థానం లేకపోతే నా ప్రారబ్ధ మనుకుంటాను, మౌనంగా సెలవు పుచ్చుకుంటాను.

## సందీపుడు చెప్పిన కథ

"నాకు లభ్యమైనదే నాది," అనుకునేవాడు అసమర్థుడు. సమర్థుడైనవాడు, "నేను కాజెయ్యగలదంతా నాదే," అనుకుంటాడు. ప్రపంచ గుణపాఠం ఇదే. నేను పుట్టిన దేశం గనక ఇది నా దేశమంటే నిజంగా నా దవుతుందా? బలాత్కారంగా జయించుకున్నా నాదే నా దవుతుంది.

పొందడమన్నది ప్రతివాడికీ సహజ హక్కు. లోభం సహజమైనది. నా మనసు కోరినదాన్ని పరిసరా లివ్వాలి. నీతులూ, ధర్మపన్నాలూ చెప్పేవాళ్ల చేతగాని వాజమ్మలు. గాఢంగా వాంఛించడమూ, అనుభవించడమూ, అరమరాభ్యంతరాలను తోసిపారెయ్యడమూ నేర్చినవారే అదృష్ట దేవతకు ఆప్తులు. కోరదగినదానికోసం నదులకు అడ్డంగా ఈదాలి, గోడలు దూకాలి, ద్వారాలు పగలదన్నాలి. అలా పొందడంలోనే ఆనందమూ, పొందినదాని విలువా ఉంటుంది.

పెళ్ళిబాజా వినిపిస్తోంది. ముహూర్తం దాటిపోనివ్వరాదు. నా హృదయం ఆత్రపడుతోంది. పెళ్ళికొడుకెవరు? నేనే! చేత దివిటీ పట్టుకుని ముహూర్తానికి హాజరయినవాడే పెళ్ళికొడుకు. ప్రకృతి నిర్దేశించిన పెళ్ళికొడుకు, అనుకోకుండానూ అనాహూతుడుగానూ వచ్చేస్తాడు.

సిగ్గా? నాలో ఏకోశానా లేదు. కావలిసినది అడిగి పుచ్చుకుంటాను; ఒక్కొక్కప్పుడు అడగకుండానే పుచ్చుకుంటాను. పిరికివాళ్ళు మర్యాదలు పాటిస్తారు. ఇది వాస్తవ జగత్తు. ఇందులోకి వచ్చినవాడు ఖాళీ చేతులతోనూ, ఖాళీ కడుపుతోనూ వెళ్ళిపోతే, మొదలు వా డెందుకు వచ్చినట్టు?

నేను కోరేదేదో బలంగానే కోరుతాను. దాన్ని రెండు చేతులా పొదివి పట్టుకుంటాను. ఒళ్ళంతా పులుముకుని, అందులో మునిగి తేలుతాను. తనివితీరా అనుభవిస్తాను.

ఏదీ దాచిపెట్టుకోను. అది పిరికితనం. కాని దాపరికం అవసరమైనప్పుడు దాచకపోవడం కూడా పిరికితనమే. నీ దురాశకొద్దీ నువు గోడలు ఏర్పాటు చేసుకుంటావు. నా దురాశకొద్దీ నేను వాటిని పడగొట్టుతాను. నీ శక్తి నీది, నా యుక్తి నాది. ఇదే జీవిత వాస్తవికత. దీనిమీదే రాజ్యాలూ, సామ్రాజ్యాలూ ఆధారపడ్డాయి.

ఆకాశంనుంచి భూమికి అవతరించిన మహాపురుషులు చెప్పే ధర్మపన్నాలు దుర్బలులకు. బలవంతులూ, ప్రపంచాన్ని ఏలేవాళ్ళూ వాటిని లక్ష్యపెట్టరు.

కొందరు చావడానికే నిర్ధారణ చేసుకుని పుట్టినట్టు కనబడతారు. సూర్యాస్తమయంలోలాగా, చావులాంటి బతుకులోకూడా సౌందర్యం ఉంటుంది కాబోలు. నిఖిలు డిలాటిబతుకే బతుకుతున్నాడు.

ఈ విషయమై చాలా ఏళ్ళక్రితం అతనికీ నాకూ వాదన జరిగి

మా చర్చలలో నా భర్తకు స్థానం ఉండేదికాదు. సందీప్‌బాబు నా భర్తపట్ల ఎంతో ప్రేమ కనబరుస్తూకూడా, సలహా ఇవ్వలేని బుల్లి తమ్ముడికింద జమకట్టేవాడు.

జీవద్బంధాలను విచ్ఛేదనం చేసేటప్పుడు మనిషి కా సంగతి ఏమాత్రమూ తెలియకుండా ప్రకృతి అనేక మత్తుమందులను వాడుక చేస్తుంది. నా జీవితంలో ఎలాటి దారుణమైన విచ్ఛేదనం జరుగుతూన్నదీ మత్తుమందు ప్రభావంవల్ల నేను తెలుసుకోనేలేదు. స్త్రీ ప్రకృతే అలాటిదేమో.

## సందీపుడు చెప్పిన కథ

ఎక్కడో పొరబాటు జరిగింది. మొన్న ఒకనాడా సంగతి నాకు తెలిసివచ్చింది.

నే నిక్కడికి వచ్చిన రోజునుంచీ నిఖిలుడిగది స్త్రీ పురుషులకు సమంగా ఉపయోగపడుతున్నది. విమల జనానాలోనుంచి ఆ గది లోకి వచ్చేదారి ఉన్నది. బయటినుంచి నేను అక్కడికి స్వేచ్ఛగా వెళ్ళవచ్చు.

రాణి నిఖిలుడి గదిలోకి వచ్చిందంటే నాకు తెలుస్తుంది. గాజుల చప్పుడూ, ఇతర ధ్వనులూ వినవస్తాయి. నేను వచ్చేసరికి రాణి నాకు వీపుపెట్టి, అలమారుల్లోనుంచి ఏదో పుస్తకం తీస్తూఉంటుంది. నే నామెకు సహాయం చేయబోతాను. ఆమె వద్దంటుంది. అటు తరవాత ఇతర కబుర్లలోకి దిగుతాం.

మొన్నటి గురువారపు దుర్దినంనాడు గాజుల గలగల విని నేను నిఖిలుడి గదికి బయలుదేరాను. గదిబయట నడవలో ఒక నౌక రుండి, "అటు పోరాదు," అని అటకాయించాడు.

"ఎందుచేతా ?" అన్నాను.

"అక్కడ రాణీఅమ్మగా రున్నారు."

"సరే అయితే, సందీప్‌బాబు చూడాలంటున్నారని రాణీఅమ్మ గారితో చెప్పు."

"వల్లకాదు, బాబూ. ఆజ్ఞలేదు."

నాకు మండిపోయింది. "నే నాజ్ఞాపిస్తున్నాను. నేను వచ్చానని చెప్పు," అని గొంతెత్తి పలికాను.

వాడు చిక్కులోపడ్డాడు. ఈ లోపుగా నేను వాకిలి సమీపించాను. వాడు నావెనకనే వచ్చి, నాచెయ్యి పట్టుకుని, "నావల్లకాదు బాబూ," అన్నాడు.

ఎంత సాహసం! నౌకరువెధవ నన్నంటుకుంటాడా ? చెయ్యి విదిలిచుకుని వాడిగూబ పగలగొట్టాను. అప్పుడే రాణి గదిలోనుంచి ఇవతలికి వచ్చి, క్రోధోద్రేకంతో, "శంకూ, పో అవతలికి !" అన్నది.

"వాణ్ణి కోప్పడవద్దు. ఆజ్ఞ లేకబోతే వెళ్ళిపోవలసింది నేను," అన్నాను.

రాణి వణుకుతున్న గొంతుతో, "మీరు వెళ్ళిపోవద్దు, లోపలికి రండి," అన్నది; అది వేడుకోలుకాదు. ఉత్తరువు.

ఆమె ఒక చీటీ రాసి, నౌకరును పిలిచి, "దీన్ని మహారాజుగారి కియ్యి," అన్నది.

"నన్ను క్షమించాలి. కోపంలో మీ మనిషిని కొట్టేశాను," అన్నాను.

"వాడి కలా కావలిసిందే."

"పాపం, వా డేంచేస్తాడు ? వాడి కలా ఆజ్ఞ ఇచ్చారు."

నిఖిలుడు వచ్చాడు.

"శంకూ సందీప్‌బాబును అవమానించాడు," అని అతనితో రాణి చెప్పింది. నిఖిలుడు నిర్ఘాంతపోయినట్టు కనబడ్డాడు.

"సందీప్‌బాబు ఇక్కడికి వస్తుంటే అడ్డు తగిలి ఉత్తరువు లేదన్నాట్ట," అన్నది రాణి.

"ఎవరి ఉత్తరువు ?" అని నిఖిలు డడిగాడు.

"ఏమో నాకుమటు కేం తెలుస్తుంది?" అన్నది రాణి.

నిఖిలుడు శంకూను పిలిపించి అడిగితే, "పెద్దరాణిగారి ఉత్తరువు," అని శంకూ చెప్పాడు. వాడు వెళ్లాక రాణి, "శంకూను పంపెయ్యాలిసిందే," అన్నది.

నిఖిలుడు ఏమీ అనకుండానే వెళ్ళిపోయాడు. మర్నాడు నాకూ ఎక్కడా కనిపించలేదు. ఎస్టేటులో మరొకచోటికి వాణ్ణి పంపారని తెలిసింది. ముసుగులో గుద్దులాట చాలా జరిగినట్టు కనబడింది. మొత్తంమీద నిఖిలుడు విచిత్రవ్యక్తి.

ఇది జరిగిన అనంతరం రాణి బహిరంగంగానే నిఖిలుడి గదికి పిలిపించసాగింది. మహారాజుల ఇంటి కోడలిని బయటివాడు చేరుకోవాలంటే మామూలుగా మార్గమే లేదు. అయితే సత్యం జయించడంవల్ల ఒక్కొక్క పరదాయే పక్కకు తొలిగి ప్రకృతి నగ్నంగా సాక్షాత్కరిస్తున్నది.

అవును, సత్యమే! స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ ప్రాథమిక సత్యం. ప్రకృతిలోని ప్రతి అణువూ ఆ సత్యాన్ని ఎలుగెత్తి చాటు తుంది. కాని మనుషులు దాన్ని కప్పిపెడతారు. ఏవేవో ఆంక్షలు పెడతారు. నగ్నసత్యం వాస్తవాన్ని మేల్కొలిపాక పళ్ళు కొరికి పరవళ్ళు తొక్కుతారు. కాని తుపానుతో పోరాడడం ఎవరితరం? అది మన మాట వినిపించుకోదు.

క్రమంగా సాక్షాత్కార మవుతున్న ఈ సత్యాన్ని చూసి ఆనందం పొందుతున్నాను. పాదాల తొట్రుపాటు, పక్కచూపులు — వంచన మాత్రమే కాదు, ఆత్మవంచన కూడానూ. ఈ స్థితిలో నేను నా ఆవేశాన్ని వ్యక్తం చెయ్యటానికి లేదు.

పాపం, రాణి ఇంకా స్వాప్నిక దశలోనే ఉన్నది. తా నెటుపో తున్నదీ ఆమెకు తెలీదు. సమయం వచ్చినదాకా మేలు కొలుప రాదు. నేనుకూడా నిద్రావస్థలో ఉన్నట్టే నటించడం మంచిది.



మొన్న ఒకనాడు భోజనాలదగ్గిర ఆమె నా కేసి విచిత్రంగా చూస్తుండడం గమనించి, ''నా ఆకలి చూసి ఆశ్చర్యంగా ఉందా? నేను ఏదైనా దాచగలను గాని నా ఆశపోతు తనాన్ని దాచలేను. నాకు బిడియం లేదు," అన్నాను.

ఆమె జేవురించిన ముఖంతో, "లేదు, లేదు. నేను–" అన్నది.

"నాకు తెలుసు. ఆడవాళ్ళకు ఆశపోతు లంటే ఇష్టం. ఆ ఆశపోతుతనం తమది పైచెయ్యి అయేటట్టు చేస్తుందని వాళ్ళరుగుదురు. అలాటి స్త్రీ లనేకమంది నన్ను పాడుచెయ్యబట్టే నాకు సిగ్గు బిడియాలు లేకుండా పోయాయి," అన్నాను

ఇంకొక రోజు నాకొక ఇంగ్లీషు పుస్తకం దొరికింది. అందులో సెక్సు సమస్యలు ధైర్యంగానూ, వాస్తవికంగానూ చర్చించి ఉన్నాయి. ఆ పుస్తకాన్ని నిఖిలుడి గదిలో వదిలేశాను. మర్నాడు అపరాహ్నం నే నక్కడికి వెళ్ళేసరికి రాణి దాన్ని చదువుతూ కనిపించింది. నా అడుగుల సవ్వడి వినిపించగానే ఆమె ఆ పుస్తకాన్ని పెట్టేసి. దానిపైన యకావ్యగ్రంథాన్ని పెట్టింది.

"కవిత్వం చదవడానికి మగవాళ్ళు బిడియపడాలిగాని ఆడవాళ్ళకు బిడియం దేనికి? ఆమాటకువస్తే స్త్రీలే యరత్నాలు. బ్రహ్మదేవుడు మహాకవి," అన్నాను.

నా మాటల కామె బాధపడుతూ వెళ్ళిపోబోయింది.

"వద్దు, వద్దు. నీ చదువు కానీ. నే నిక్కడ నా పుస్తకం వదిలాను. అది తీసుకుని వెళ్ళిపోతాను," అంటూ నా పుస్తకం తీసుకుని, "ఇంకా నయం, ఇది చదివావు కావు. చదివితే నేను చివాట్లు తినిఉండేవాణ్నే," అన్నాను.

"అదేం?" అన్నది రాణి.

"ఇది కవిత్వంకాదు, మొరటుగా చెప్పిన మొరటు విషయాలు. నిఖిలుడు చదివితే బాగుణ్ణు,'' అన్నాను.

''ఎందుకలా?"

"అతను మాలాటి మగవాడు. నా పేచీ అల్లా అతను ప్రపంచాన్ని భావచిత్రంగా చూస్తాడనే. అతనికి స్వదేశీఉద్యమం ఒక కావ్యం లాంటిది. మేము దుడ్డుకర్రలతో కవిత్వాన్ని బాదేవాళ్ళం."

"మీ పుస్తకానికీ స్వదేశీ ఉద్యమానికీ ఏమిటి సంబంధం?"

"చదివితే నీకే తెలిసేది. అతను ప్రతి దానికీ సూత్రాలంటాడు. వాటికీ మానవ స్వభావానికీ తభావతు వస్తే, మానవ స్వభావాన్ని నిందిస్తాడు. మాటలకు ముందే పుట్టిన మానవస్వభావం సూత్రాలకు కట్టుబడేనా?"

రాణి కాసేపు మౌనంగా ఉంది. "తనను తాను వృద్ధిచేసుకోవడం మానవ స్వభావం కాదా?" అని అడిగింది

నాలో నేను నవ్వుకున్నాను. అవి ఆమెమాటలు కావు. నిఖిలుడివి. ఆమె రక్తంలో అగ్ని ప్రజ్వలిస్తున్నది; నాకు తెలుసు.

"దుర్బలులే అధికసంఖ్యాకులు. ప్రకృతి వాళ్ళకు శక్తి నివ్వలేదు. అంచుచేత వాళ్ళు ఇతరులకు విషం నూరిపోసి. వాళ్ళను కూడా దుర్బలులను చేయజూస్తారు," అన్నాను.

''మా ఆడవాళ్ళు బలహీనులు గనక ఈ కుట్రలో మాకుకూడా చోటుంటుంది,'' అన్నది రాణి.

"ఆడవాళ్ళేమిటి, దుర్బలు లేమిటి? ఆ మాట అని పురుషులు మిమ్మల్ని మభ్యపెడుతున్నారు. అసలు బలం మీ స్త్రీలదే. మీరు వాస్తవాన్ని గర్భాన ధరిస్తారు, కంటారు. స్తన్యమిచ్చి పోషిస్తారు," అన్నాను.

''అలా అయితే స్త్రీలలో పురుషుడికి ఆకర్షణే ఉండదు."

"కనకనే స్త్రీలు పురుషుల ధర్మపన్నాలనే ఉపయోగించి, వారిని మభ్యపెడతారు. పురుషుడికోసం కాకపోతే స్త్రీకి ఈ నటనతో పనేలేదు."

"అలాంటప్పుడా భ్రమను తొలగించడాని కెందుకు ప్రయత్నిస్తున్నారు?"

"ఎందుకా? నా దేశం స్వతంత్రం కాగలందులకు? మనుషుల మధ్య స్వేచ్ఛా సంబంధా లేర్పడగలందులకు."

నేను కాస్త మితిమీరిన సాహసమే చూపాను; కాని సాహసం స్త్రీలను ఆకర్షిస్తుంది.

మా సంభాషణ మంచి పట్టులో ఉండగా, నిఖిలుడి గురువు చంద్రనాథబాబు వచ్చాడు. ఈ ముసలిపంతుళ్లు లేకుండా ఉంటే ప్రపంచం బాగుపడిపోను. ఈ ముసలి బడిపంతులు పానకంలో పుడకలాగా తగిలాడు.

ఆయన వస్తూనే, "క్షమించాలి. నేను–" అంటూ వెళ్ళిపో

బోయాడు. కాని రాణి లేచివెళ్ళి, "వెళ్ళిపోకండి. వచ్చి కూర్చోరూ?" అని ఆహ్వానించింది; ముణిగేవాడు గడ్డిపరకను పట్టుకున్నట్టు! పిరికిపంద!

లేక నన్ను ఉడికించడానికో! 'నీకన్న ఆరాధనీయు లున్నారు.' అని నాకు తెలియ జెప్పడానికేమో.

చంద్రనాథబాబు స్వదేశీ ఉద్యమం గురించి సోది ప్రారంభించాడు. నేను చాలా సేపు కల్పించుకోలేదు. కాని ఆయన, "మనం పళ్లు కోసుకోవాలంటే విత్తులు నాటాలి," అన్నప్పుడు నేను అడ్డం తగిలి, "పళ్ళెవరికి కావాలండీ. 'కర్మణ్యేవాధి కారస్తే, మా ఫలేషు కదాచన' అన్నాడు గీతాకారుడు," అన్నాను.

"అయితే నీకు కావలిసిం దేమిటి?" అని ఆయన అడిగాడు.

"ముళ్ళు. ఖర్చు లేకుండా నాటవచ్చు," అన్నాను.

"అవి ఇతరులతోబాటు మన కాళ్ళలోకూడా గుచ్చుకుంటాయే."

"కావచ్చు. కాని ఆ నీతి ఎవడికక్కరాలి. మన గుండెలు మండిపోతుంటే, ఇతరుల కాళ్ళలో గుచ్చుకోవడానికే ముళ్ళు నాటుతాం. అవి మన కాళ్ళలోనే గుచ్చుకున్ననాడు తాపీగా పశ్చాత్తాపపడవచ్చు. దానికని భయపడాలా? చచ్చాక చల్లబడటం ఉండనే ఉంది. లోపల వేడి ఉండగా తెర్లుదాం, మరుగుదాం," అన్నాను.

చంద్రనాథబాబు నవ్వి, "కావలిస్తే అలాగే మరుగు. కాని అది పరాక్రమమని మాత్రం అనుకోకు. పైకి వచ్చిన ఏ దేశమూ తెర్లలేదు; కార్యాచరణ చేసింది," అన్నాడు.

నేను చెంపపెట్టులాటి జవా బిద్దా మనుకుంటూండగా నిఖిలుడు వచ్చాడు. చంద్రనాథబాబు పని ఉన్నదని వెళ్ళిపోయాడు.

నిఖిలుడికి నా పుస్తకం చూపించి. "దీని గురించి రాణికి చెబుతున్నాను," అన్నాడు. అతనిలాటివాణ్ణి నిజంతోనే మభ్యపెట్టాలి.

నిఖిలుడు పుస్తకం పేరు చూసి దాన్ని తాను చదివా నన్నాడు.

"ఏమిటి నీ అభిప్రాయం?" అని అడిగాను.

ఆలోచనాశక్తి గలవారికి మంచిపుస్తకమే, కాని ఆలోచించే ఓపిక లేనివారికి విషంలాటిది," అన్నా డతను.

దానిమీద ఇద్దరమూ చర్చించుకున్నాం. ఉద్రేకపూరితులకు ఆ పుస్తకం సరిగా అర్థం కాదన్నా డతను. ఉద్రేకం దారిచూపే దీపమనీ, దాన్ని తోసిపుచ్చినవాడు గుడ్డివాడే ననీ నే నన్నాను.

"ఉద్రేకం పనికిరాదన లేదు. దానితోబాటు నిగ్రహంకూ కావాలి. చూడదలచిన వస్తువును కళ్ళలో గుచ్చుకోం. మనసుకూ అది పరిశీలించే వస్తువుకూ మాధ్య కొంత ఎడం ఉండాలి. లేకపోతే అసలుకు మోసం," అన్నా డతను.

ఈ వాగ్వాదంలోకి రాణికూడా ప్రవేశిస్తుందని ఆశించాను. కాని ఆమె అలా చెయ్యలేదు.

"మనం ఇలా చర్చించుకోవడం మంచిదయింది. ఈ పుస్తకాన్ని చదవడానికి రాణి కిద్దా మనుకుంటున్నాను," అన్నాను.డా

"తప్పేం? నేను చదవగాలేనిది, విమల ఎందుకు చదవరాదూ? నే ననేదల్లా ఏమంటే, పాశ్చాత్యులు అచ్చగా శాస్త్రదృష్టితోనే ప్రతిదీ చూస్తారు. మానవుడికి సంబంధించిన విజ్ఞానమంతా కలిసినా మానవుడి ప్రమాణాన్ని చేరదు. మానవుణ్ణి తెలుసుకోవాలంటే అంతస్సునుంచి తెలుసుకోవాలి; విజ్ఞానవేత్తలనుంచికాదు. నువు మానవుణ్ణి హీనుడుగా చూసి, అతనికి అన్యాయం చేస్తున్నావు." అన్నా డతను.

"ఇదంతా నీ కెక్కడ గోచరించింది?" అన్నాను.

"వాతావరణంలో, దహించుకుపోతున్న నా భావనలో. మనిషిలోని నిస్వార్థాన్నీ, సౌందర్యాన్నీ హింసించకుండా నువు ఉండలేవు. స్పష్టంగా చెబుతున్నాను, సందీప్! మనిషి తీవ్రంగా గాయపడవచ్చు, కాని చావడు. అందుకే నేను అంతా ఎరిగి, ప్రత్యక్షంగా చూస్తూకూడా అంతా సహిస్తున్నాను," అంటూ అతను లేచి గదినుంచి వెళ్ళిపోయాడు. అతని వెనకనే రాణీకూడా వెళ్ళిపోయింది.

విచిత్రమైన మనిషి నిఖిలుడు. తన సంసారానికి జరగనున్న ప్రమాదం గుర్తించికూడా న న్నెందుకు వెళ్ళగొట్టడు? నాకు తెల్సు; అతను విమల నోటిమాటకోసం వేచిఉన్నాడు. తమకు పొత్తు కుదరదని విమల అన్న మరుక్షణం అతను శిరస్సు వంచి, పొరబాటు జరిగిపోయిందని ఒప్పుకుంటాడు. పొరబాటును ఆమోదించడంకన్న పెద్ద పొరపా టుండదని గ్రహించేపాటి బలం అతనిలో లేదు. చాలా చిత్రమైన మనిషి.

రాణి మాటేమిటి? ఇవాళతో ఆమె స్వప్నాలు ముగిశా యని తోస్తుంది. తనను ప్రవాహం ఎటుగా లాక్కుపోతున్నదీ ఆమెకు తెలిసివచ్చింది. ఇప్పు డామె ముందుకైనా రావాలి, వెనక్కయినా పోవాలి. ఈ బెదురువల్ల ఆమె ఉద్రేకం హెచ్చుతుందే గాని తగ్గదు.

ఈ నాటకం అంతు చూసిగాని వదలను. దురదృష్టవశాన నేను ప్రేక్షకుణ్ణికాక, నటు ణ్ణయిపోయాను. నా హృదయం ఒకే తీరుగ నలిగిపోతున్నది. నరాలు మహా తీపుపెడుతున్నాయి. రాత్రి దీపం ఆర్పి పడుకోగానే చిన్న చిన్న స్పర్శలూ, మాటలూ నాపైన ముసురుతాయి. తెల్లవారి లేచాక ఏదో జరగబోతున్నట్టు ఆశగా ఆనందం కలుగుతుంది; నా రక్తంలో వీణలు మోగుతాయి ...

బల్లమీద జంటఫోటోల చట్రంలో నిఖిలునిఫొటో, రాణిఫొటో ఉండేవి. ఆమె ఫొటో కాజేసి, రాణికి ఖాళీ చూపించి, "అవతలవాళ్ళు లోభు లైనప్పుడు చౌర్యం తప్పనిసరి అవుతుంది. పాపం ఇద్దరికీ చెరిసగం. ఏమంటావు?" అన్నాను.

ఆమె చిన్నగా నవ్వి, "అదంత మంచిఫొటోకాదు," అన్నది.

"బొమ్మ బొమ్మే. ఎలాటిదైనా దానితోనే తృప్తిపడాలి," అన్నాను.

ఇవాళ ఆ ఖాళీలో నా ఫొటో పెట్టాను. ఎంతచెడ్డా, నేనూ నిలుడూ ఆబాల్య స్నేహితులంకద!



## నిఖిలుడు చెప్పిన కథ

నన్నుగురించి నే నెన్నడూ ఆలోచించి ఉండలేదు. కాని ఇటీవల నేను విమల కెలా కనిపిస్తానో నని ఆలోచిస్తున్నాను. ప్రతిదీ సీరియస్‌గా తీసుకునే నేను ఎంత గుబులు కలిగిస్తూ ఉండాలి! ప్రపంచాన్ని అశ్రువులలో ముంచేకన్న, దాన్ని చూసి నవ్వెయ్యడం మంచిది కాదా? ప్రపంచమంతటా గల కష్టాలూ, బాధలూ పట్టించుకునే మాటుంటే మనకు నిద్రాహారా లుండేవా ?

కాని ఇది నా సొంతబాధ. ఇది నాకు తీరని భారమై కూర్చున్నది. విమల నా కేమిటవుతుంది ? నా భార్యా? భార్య అంటే ఏమిటి ? మన నోటిగాలితో పెద్దదిగా ఊదుకుని, అహోరాత్రాలూ భద్రంగా కాపాడుకునే బుడగ. అవతలినుంచి సూదిమొన తగిలితే చాలు, విచ్చిపోతుంది.

నా భార్య! నా సొంతం! ఆమె "నేను నేనే" అంటే, "కాదు, నువు నాదానివి!" అనాలా ? నా భార్య అనేది ఒకవాదనా ? ఒక నిండుప్రాణి ఆ కాస్త మాటలో ఇముడుతుందా? కాని ఆ కాస్త మాటను నా జీవితంలోకెల్లా అతిపవిత్రమూ, అత్యంత ప్రియమూ అయినదాన్నిగా భావించి ఆరాధించానే! అలాటిది కాగితప్పడవలాగా మురుగుకాలవవెంట కొట్టుకుపోతే—?

ఈర్ష్యతో మురుగుకాలవ అనుకుని ఏం ప్రయోజనం ? విమలా నాది కానిపక్షంలో కాదంతే. ఎంతతర్కించి ఏంలాభం ? నా హృదయం బద్దలవుతుందా ? అవనీ! ప్రపంచం కొల్లబోదు. ఆ మాటకు వస్తే నాజీవితమూ కొల్లబోదు. మనిషి తనను మించినదేదీ కోల్పోడు. శోకసముద్రానికైనా ఆవలిగట్టున్నది. లేకపోతే ఎవరూ ఏడవరు.

విమలకు ఎన్నో ఆదర్శాలంకరణలు తగిలించాను. వాటిని తీసెయ్యవలసిన తరుణం వచ్చింది. నా బలహీనతకొద్దీ అలా ఆమె నారాధించాను నా సంతోషం పెంచుకో గలందుల కామె నొక దేవత చేసేశాను. విమల విమలే. నా ఆనందంకోసం ఆమె దేవత కావాలనడం అన్యాయం.

ఆమె ప్రవృత్తికి సందీపుడే తగునేమో. సందీపుడిలో ఆకర్షవంతమైన లక్షణాలు లేకపోలేదు. వాటి ప్రభావం నే నెరుగుదును. కాని అతను నన్ను మించినవా డనిపించదు. విజయమాల నాకుకాక అతనికే లభించితే అది ఇచ్చేవాళ్ళతప్పు. ఇది గర్వంకొద్దీ అన్న మాటకాదు. నన్ను నే నిప్పుడు సరిగా అంచనా వేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. నాలో ఉన్న దనుకున్నది గాక నిజంగా ఉన్న దేదో ఇప్పుడు గ్రహించాను. లాభనష్టాలు బేరీజు వేశాక మిగిలినవ్యక్తి అవిటివాడుకాడు, క్షుద్రుడుకాడు; కష్టాలన్నీ అనుభవించి బయటపడినవాడు.

నేను పడుకుందామని లేవబోతుండగా కిటికీలోనుంచి పెద్ద నక్షత్రం కనిపించింది. అది నాతో, "స్వాప్నిక సంబంధాలు ఏర్పడతాయి, విడిపోతాయి—కాని నేను శాశ్వతంగా ఇక్కడే ఉన్నాను—శోభన రాత్రియొక్క శాశ్వతజ్యోతిని," అన్న ట్టనిపించింది. అవును, ఈ భౌతిక ప్రపంచానికి అవతల నా నిత్యప్రేయసి నాకోసం నిరీక్షిస్తోంది. ఎన్నో యుగాలలో, ఎన్నో దర్పణాలలో ఆమె ప్రతిబింబాన్ని చూశాను. ఆ దర్పణాలను నా పెట్టెలో దాచ యత్నించినప్పుడల్లా ఆ ప్రతిబింబం మాయమయింది. కాని నా కీ అద్దా లెందుకు? ప్రతిబింబాలు మాత్రం దేనికి ?

అర్థంలేని పేలాపనా? ఆత్మవంచనా? కావచ్చు. లేదు, నా శాశ్వతప్రేయసి నన్ను వంచించదు. ఆమె వాస్తవమైనది. ఆమెను నేను చూశాను. ఇంకా ఎన్నోసార్లు చూస్తాను. నక్షత్రం నా కభయం ఇస్తున్నది. నిత్యమైనది లేకుండాపోవడం జరగదు.

నేను వెళ్ళి విమల నొకసారి చూస్తాను. ఆమె అలసిపోయి గాఢనిద్రలో ఉండాలి. బాగా పొద్దుపోతేనే గాని—విమల నిద్రపోతూంటేనే గాని—నేను పడుకోవటానికి పోవటానికి లేదు. పగలు మేము కలుసుకుంటాం, మాట్లాడుకుంటాం. కాని రాత్రివేళ ఒంటరిగా ఉన్నప్పు డేం మాట్లాడాలి? నా మనసూ, శరీరమూకూడా అవమానంలో కుంగిపోతాయి.

విమల నిద్ర లేవకుండా ఆమె నుదుటిపైన ముద్దు పెట్టుకుంటాను. అదే నా పుష్పాంజలి. నేను మరణించి, నా తప్పులూ, నా బాధలూ అన్నీ విస్మృతి చెందాకకూడా ఆ ముద్దు జ్ఞాపకం ఉండాలి.

గడియారం రెండు కొట్టింది. మా వదినె గదిలోకి వచ్చి, "ఇక్కడ ఏం చేస్తున్నావు మరిదీ? నీ ఆవేదన కట్టిపెట్టి వెళ్ళి పడుకో. నీ ముఖాన ఆవేదన చూడలేకుండా ఉన్నాను," అన్నది.

నా నోట మాట రాలేదు. ఆమె పాదధూలి తీసుకుని, వెళ్ళి పడుకున్నాను.

## విమల చెప్పిన కథ

మొదట్లో నేను ఏలాటి భయాలూ, ఏ సంకోచమూ లేకుండా దేశానికి అంకితమైపోయాను. ఆత్మబలిలో అపారమైన ఆనందం కనిపించింది. ఈ ఉద్రేకం దానంతట అది చల్లారిపోకుండా సందీప్‌బాబు సాక్షాత్కరించాడు. అతని కంఠధ్వనిలో నాకు మృదువైన స్పర్శా, అతని చూపులలో భిక్షుకుడి ప్రాధేయతా కనిపించాయి. అతని భావోద్రేకం నన్ను వేళ్ళతోసహా పెకలించి, ఈడ్చుకుపోయేలాగ కనిపించింది.

నిజం దాచను — బలవత్తరమైన వాంఛ నన్ను అహోరాత్రాలూ పట్టి లాగింది. ఆత్మ విధ్వంసంలో నాకు ఆనందం స్ఫురించింది. ఎంత సిగ్గుచేటు, ఎంత భయంకరం — కాని ఎంత ఆనందం!

ఆరాధనతో ఆరంభించాను. త్వరలోనే అది పోయింది. సందీపుడంటే గౌరవంకూడా పోయింది; తక్కువభావం ఏర్పడింది. కాని అతనిలో ఆకర్షణ హెచ్చసాగింది.

చంద్రనాథబాబు తీరిక ఉన్నప్పుడు నా వద్దకు వచ్చి, నా మనస్సును ఉన్నతపథాల కెత్తి, నా జీవితం విస్తృతమైనదనీ, నేనూహించిన సరిహద్దులలో అది బంధించి లేదనీ తెలియజెప్పుతారు. కాని నాకు బంధవిమోచనం కావాలని ఉంటేగద? వంశ గౌరవం మంటగలిసినా సరే ఈ వ్యామోహము నాలో నిలిచిఉండాలనే నేను ప్రార్ధన చేశాను.

ఒక్కొక్కసారి నా జీవితం పీడకల అనిపిస్తుంది. నా గత జీవితానికీ దీనికీ ఏమీ సంబంధంలేదు. ఈ పరిస్థితి ఎలా ఏర్పడిందో నాకు బోధపడదు.

ఒకనాడు మా తోడికోడలు, "మా చిన్నరాణి ఆతిధ్యం మహత్తేమిటో గాని, ఆమె అతిధి ఎంతకీ వెళ్ళడు. మా కాలంలో కూడా అతిధులొచ్చేవారు, కాని వారి కింత రాజోపచారంగా జరిగేది కాదు. మా కెంతసేపూ మా భర్తల గొడవే పట్టేది. మరీ ఆధునికుడైన పాపానికి, పాపం, నిఖిలుడు అనుభవిస్తున్నాడు. అతిధిగా వచ్చిఉంటే అతనికీ అన్ని మర్యాదలూ జరిగేవి. అతని కచేరి చేమొచ్చులాగుంది...ఓసి రాక్షసీ, నీ కళ్లు పొరపాటున కూడా అతని దిగులు ముఖంమీదికి మళ్ళవా ఏం?" అన్నది.

నాకు చీమ కుట్టినట్టయినా అనిపించలేదు.

ఇటీవల మా సంభాషణ దేశం గురించి కాక, ఆధునిక సెక్సు సమస్యలపైన సాగుతోంది. ఇప్పుడిక గోప్యం కూడా ఏమీలేదు. సందీప్‌బాబు వెళ్ళకపోవడానికీ, మేము రహస్యాలోచనలలో కాలం గడపడానికీ సాకంటూ ఏమీ లేదు.

ఈ పరిస్థితి చూసి నాకు నా మీదా, ప్రపంచంమీదాకూడా రోత కలిగి, చచ్చినా జనానా దాటి అవతలికి పోరాదని ఒట్టుపెట్టు

ముక్కోటి ఆంధ్రులకు దీపావళి శుభాకాంక్షలు!

Bengal
THE NATION'S BEST

ఇదుగో బెంగాల్ బల్బు!

* నిరాడంబరంగా కనిపించినను, నిర్మాణంలో మూడు దశాబ్దాల అనుభవం ఇమిడివున్నది. * అభివృద్ధి చెందిన సాంకేతిక విజ్ఞాన శాస్త్ర నిపుణుల నైపుణ్యంతో ఈ బెంగాల్ బల్బు తయారుచేయబడింది. * పెద్దలకు, పిన్నలకు అందరికీ అవసరమైన స్వచ్ఛమైన కాంతిపుంజములను బెంగాల్ బల్బు విరజిమ్మును. * ఎచ్చట ఏ క్షణంలో చూచినా లక్షలాది బెంగాల్ బల్బులు వెలుగుతూవుంటాయి. * దగ్గరలో ఉన్న బల్బులను చూడండి; అది బెంగాల్ బల్బే కావచ్చు.

సోల్ సెల్లింగ్ ఏజంట్స్: జి. ఎ. పరశురామ్ & కంపెనీ
బెంగాల్ హౌస్, లకిడికాపూల్, హైదరాబాద్ — 4.

కున్నాను. రెండురోజులపాటు అలాగే వెళ్ళలేదు. నేను చాలా చెడిపోయి ఉండాలి. నాకు బతుకు శూన్యంగా కనపడసాగింది. ఏదీ చెయ్యబుద్ధి పుట్టదు. నా రక్తంలో దేనికొరకో ఆరాటం చెలరేగుతున్నది కావాలని పని కల్పించుకున్నాను. పడకగది బాగా కడిగించి, మళ్ళీ మళ్ళీ తుడిపించాను. బీరువాల్లో సామానులన్నీ బయటికి లాగి, వాటిని మరొక విధంగా సర్దాను. సామాన్ల గదిలో సరుకులు నిండుకున్నట్టు కనిపించాయి. ఎవరో వాటిని తస్కరిస్తూ ఉండాలి. ఎవరిమీద ఎగరటానికీ ధైర్యం చాలలేదు; "ఇన్నాళ్లూ నీ కళ్ళేమయాయి ?" అని అడిగిపోగలరు.

ఆ రోజు దయ్యం పట్టినదానిలాగ ప్రవర్తించాను. మర్నాడు పుస్తకం తీసుకుని చదవ యత్నించాను. ఏం చదివానో నాకు తెలీదు. నాకే తెలియకుండా ఆ పుస్తకంతో సహా బయటి గదులకు పోయే నడవలోకి వెళ్ళాను. కిటికీదగ్గిర నిలబడి, మండువా అవతలి పక్కన ఉన్న గదులకేసీ, వాటిని అనుకుని ఉన్న వరండాకేసీ చూస్తూ నిలబడ్డాను. ఆ గదులు సముద్రం అవతలి ఒడ్డున ఉన్నట్టూ, వాటిని చేరుకునేటందుకు నావ లేనట్టూ నా కనిపించింది.

నేను చూస్తుండగానే సందీపుడు తన గదినుంచి వరండాలోకి వచ్చాడు. అతను చాలా బాధతో ఉన్నట్టు కనబడ్డాడు. నేను నా ఒట్టు చెరిపేసుకుని, బయటి గదుల కేసి పోబోతుండగా మా తోడికోడలు నా వెనక నిలబడి, "ఎంత ఘోరకలిరా, భగవంతుడా !" అన్నది.

నేను బయటి గదులకు వెళ్ళలేకపోయాను.

మర్నాడు ఉదయం నౌకరొకడు సందీప్‌బా బిచ్చాడని ఒక ఉత్తరం తెచ్చి నాకిచ్చాడు. ఎంత సాహసం ! నౌక రేమనుకుంటాడు ! ఉత్తరంలో ఈ పొడి మాటలే ఉన్నాయి.

"అర్జంటు విషయం. ఉద్యమంగురించి – సందీప్.''

నేను చేస్తున్న పని మానేసి బయలుదేరాను. నేను వెళ్ళే దారిలోని వరండాలో కూర్చుని మా తోడికోడలు పోకలు కత్తిరిస్తూ, "ఎక్కడకి, చిన్నరాణీ ?" అన్నది.

''బయటి గదికి.''

"ఇంత పెందలాడే ? మాటినీ ఆటా ఏం ?''

నేను మాట్లాడకుండా సాగిపోతుంటే వెనకనుంచి ఆమె కొంటె పాట ఒకటి పాడింది.

నేను గదికి వెళ్ళేసరికి సందీపుడు ఏదో చిత్రకళకు సంబంధించిన పత్రిక చూస్తూ, నన్ను చూసి, "ఓహో, వచ్చావా ?" అన్నాడు – ఈ రెండు మూడు రోజులూ నేను కనపడకపోవడంవల్ల తనకేదో అపచారం జరిగినట్టు.

నే నేమీ జవా బివ్వలేదు. చాలా సేపు అతను నా కేసి చూస్తూ ఏమీ అనలేదు.


## చేనేత చీరలకు

ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ముఖ్యమైన కేంద్రాలు

1. గద్వాల
2. పోచంపల్లి
3. సిద్దిపేట
4. జనగామ
5. హసన్‌పర్తి
6. ఆర్మూరు
7. అమర్‌చింత
8. వెంకటగిరి
9. మంగళగిరి
10. గుంటూరు
11. ఎమ్మిగనూరు
12. పుల్లంపేట
13. నారాయన్‌పేట
14. పెడన
15. ధర్మవరం
16. మాధవరం
17. పోలవరం
18. పెద్దాపురం
19. కొత్తపల్లి
20. ఉప్పాడ
21. బండార్లంక

COTTON
&
PURE SILK
**SAREES**
IN
LATEST DESIGNS

పై కేంద్రాలకు ప్రాతినిధ్యం వహించే ఏకైక గొప్ప కేంద్రం

# ఆంధ్రా హాండ్లూం సెంటర్

నాంపల్లి (స్టేషన్ ఎదుట) హైదరాబాద్-1. ఫోన్: 34180

"నాతో మాట్లాడదామనుకున్న విషయం ఏమిటి?" అన్నాను.

"ఏదో విషయం ఉండాలా? స్నేహం చాలదా? ప్రపంచంలోకెల్లా అతి ముఖ్యమైన హృదయారాధనను ఎందు కిలా కించపరుస్తున్నావు, రాణీ?" అన్నా డతను.

నా శరీరం నిలువునా కంపిస్తున్నది. దాన్ని ఎలాగో నిగ్రహించుకుని, "ఏదో మాట్లాడాలంటే చేసే పని కాస్తా మానుకుని వచ్చాను," అన్నాను.

"అదే నేను మాట్లాడేది. నేను ఆరాధించ వచ్చానని నీకు తెలీదా? నీలో నాకు దేశదేవత సాక్షాత్కరించిందని చెబితినే! నీ చేతులు నన్ను పునీతుణ్ణి చేసినప్పుడు నా దేశం నన్ను ఆమోదించినట్టవుతుంది. ఆ భావం నా హృదయంలో ఉంటే, నేను పోరాడుతూ పడిపోగలను. ధూళిలో కాదు, ప్రేమతో పరిచిన చెండుమీద!"

అతని ఉద్రేకం రెచ్చిపోతున్నది. అది భక్తితో కూడినదో, ప్రణయంతో కూడినదో తెలీదు. ఆ ఆవేశంలో అతను నాచెయ్యి పట్టేసుకుంటాడేమో నని హడలిపోయాను. అతను అగ్నిజ్వాలలాగా చలించిపోతున్నాడు. అతని కళ్ళనుంచి నిప్పురవ్వలు కురుస్తున్నాయి.

అతను చివరకు. "నీకు గృహచ్ఛిద్రాలే దేవతలా? మమ్మల్ని స్వర్గానికో, మృత్యుముఖానికో పంపే నీ సామర్థ్యాన్ని జనానాలో పాతిపెడతావా? నీ వ్యర్థలజ్జను విడనాడు. చుట్టుపట్లవారి గుసగుసలను లక్ష్యపెట్టకు. ఇవాళే బాహ్యప్రపంచంలో నీ స్వాతంత్ర్యాన్ని ప్రకటించు," అన్నాడు.

అతనిమాటకు నేను జవాబు చెప్పేలోపల పనిమనిషి క్షేమ పరుగెత్తుకుంటూ వచ్చి, "నా జీతండబ్బులిచ్చి నన్ను పంపెయ్యండి. నా జన్మలో ఎన్నడూ ఇంత—" అంటూ, మాట పూర్తికాకుండానే ఏడవసాగింది. పెద్దరాణి పరిచారిక దాన్ని నానామాటలూ అన్నదిట. తరవాత విచారిస్తానంటే క్షేమ వినలేదు. నేను విధిగా వెళ్ళి విచారించవలసివచ్చింది.

మా తోడికోడ లింకా పోకలు కత్తిరిస్తూ, ఆ కొంటెపాటే పాడుకుంటున్నది. నేను పరిచారికల పోట్లాటమాట ఎత్తితే, "చిన్నరాణీ, ఈ చిల్లరకజ్జాల గొడవ నీ కెందుకు? నువు వెళ్ళి మీ అతిథి సంగతి చూసుకో," అన్న దామె.

నేను సందీప్‌ను కలుసుకోవడానికి బయటిగదులకు వెళ్ళడం ఎంతతప్పో అకస్మాత్తుగా తెలిసివచ్చింది. పెద్దరాణి ఇదంతా కావాలనే చేసివుంటుంది. నేను నా గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాను. నేను నా పరిసరాలకు అనుగుణంగా జీవించగలిగితే ఎంత బాగుండును. మా తోడికోడలుకు ఏ చీకూ, చింతా లేదుగద.

నాలుగేళ్ళక్రితం నా భర్త ఫొటో ఒకదానికి దంతపుచట్రం కట్టించి, నా గదిలో ఒకగూట్లో పెట్టాను. వారంరోజులక్రితందాకా

*Experts* *Punctual*

**SNOW WHITE ELECTRIC DRY-CLEANERS**

Be sure you're well dressed
Send your clothes for Expert Dry-Cleaning
To us.

**4th Line Arundalpeth,**
**GUNTUR - 2 (A. P.)**

Branches will be Opened Very Shortly at various places.

—Gemini

దానికి రోజూ పూలు పెట్టేదాన్ని. తనను అంత ఉన్నతంగాపెట్ట సిగ్గు తెప్పిస్తున్నానని నాభర్త ఆక్షేపించేవాడుకూడా. ఆయన ఆ ధోరణిలో మాట్లాడితే నాకు కష్టం వేసేదికూడా.

కాని ఇప్పుడు నా నగలపెట్టెలో ఇంకొక ఫోటో రహస్యంగా దాగివున్నది. అది సందీప్‌ది. రహస్యంగా దాచుకున్నది కావడము చేత అది నన్ను మరింతగా ఆకర్షిస్తున్నది. ప్రతిరాత్రీ దాన్ని దీపంముందు పెట్టుకుని కూర్చుంటాను. దాన్ని దీపంతో అంటించి తగలేద్దా మనుకుంటాను. చివర కొక నిట్టూర్పు విడిచి, దాన్ని తిరిగి నగలపెట్టెలో దాచేస్తాను.

నాలో సాగే ఈ అంతస్సంఘర్షణను అంతం చెయ్యాలని సందీప్ చాలా కృషిచేస్తాడు. ఆడదానికి తటపటాయింపు ఉండరా దంటాడు. "నాకిది కావాలి!" అని దృఢముగా సంకల్పించా లంటాడు. దానికి అరమరాభ్యంతరా లుండరాదు. ఎన్నిప్రాణులు బలిఅయినా సరే, ఎంత భీభత్సం జరిగినా సరే ఆ కోరిక నెగ్గ తీరాలి.

అతని మాటలు వింటుంటే నా రక్తంలో నగారాలు ప్రతి ధ్వనిస్తాయి. నా సంకోచాలన్నీ సిగ్గుపడిపోతాయి. ఇంకొక రే మనుకుంటా రన్నది చాలాహీనంగా కనిపిస్తున్నది. కాని దీని కంతకూ పర్యవసాన మెలా ఉండబోతుంది?

## సందిపుడు చెప్పిన కథ

నేనూ, నా భావాలూ ఒకటేనా అని సందేహంగా ఉంది.

గొప్పతనానికి దయాదాక్షిణ్యాలు లేవని నా సిద్ధాంతం. సామాన్య మానవులు న్యాయం పాటిస్తారు; అసాధారణవ్యక్తులు అన్యాయమే ఆచరిస్తారు. వ్యక్తులు కోటీశ్వరులూ, ప్రభువులూ అయినదీ, దేశాలు పైకి వచ్చినదీ అక్రమంద్వారా, క్రౌర్యంద్వారా. అందుకే నేను అన్యాయక్రమశిక్షణ బోధిస్తాను. అన్యాయంద్వారానే విముక్తి లభిస్తుంది. అన్యాయం దేన్నో ఒకదాన్ని దహిస్తూండకపోతే తనను తాను కాపాడుకోలేక పిడికెడు బూడిదకింద మారిపోతుంది.

నా అనుచరులకు అప్పుడప్పుడు క్రౌర్యములో పరీక్షలు పెడు తూంటాను. ఒకసారి పిక్నిక్ వెళ్ళాం; సమీపాన ఒకమేక మేస్తు న్నది. నేను నా అనుచరులకు ఒక కత్తి చూపి, "దీనితో ఆ మేకకాలు నరికి ఎవరు తెస్తారు?" అని అడిగాను. ఒక్కడూ సాహసించలేదు. నేనే లేచివెళ్ళి మేకకాలు నరికి తెచ్చాను. ఒకడు మూర్ఛపోయాడు. కాని నేను చలించకపోవటం చూసి, స్థిత ప్రజ్ఞుణ్ణని చెప్పి, అందరూ నాపాదధూళి తీసుకున్నారు. వాళ్ళు నా భావాల రూపాన్నే చూశారు; నా అంతస్స్వభావం వాళ్ళకు తెలీదు.

నేను స్వభావతః చాలా మెత్తనివాణ్ణి. దయామయుణ్ణి. నేను దురదృష్టవశాన అలా జన్మించాను.

ప్రస్తుతం నాకూ, విమలకూ, నిఖిలుడికీ సంబంధించిన ఈ


*BUY*

**Handicrafts and Handloom Products of Andhra Pradesh**

FOR

**DURABILITY AND DISTINCTION**

**HANDICRAFTS**

- Bidri Ware
- Nirmal Articles
- Ivory & Horn Products
- Silver Filigree Ware
- Kondapalli Toys
- Nakkapalli Toys
- Nirmal Toys
- Tirupathi Toys
- Clay Articles
- Leather Goods
- Crochet Laces of Narsapur
- Carpets & Durries
- Grass Mats
- Cane Furniture Etc. Etc.

**HANDLOOM FABRICS**

- Armoor Silks
- Gadwal Sarees
- Siddipet Sarees
- Pochampalli Sarees
- Uppada Sarees
- Amangal Sarees
- Himroo
- Cholkhans from Gadwal
- Siddipet Cholkhans
- Pochampalli & Jangaon Cholkhans
- Teliya Rumals
- Kalamkari Prints
- Furnishing Fabrics

Etc. Etc.

AVAILABLE AT

**GOVERNMENT HANDICRAFTS & COTTAGE INDUSTRIES EMPORIUM**

GUNFOUNDRY, HYDERABAD DN. (A. P.)

The Central Sales Emporium, Vijayawada
The Cottage Industries Sales Emporium, Tirupati
Government Handicrafts & Cottage Industries Emporium, Visakhapatnam
Government Handicrafts & Cottage Industries Emporium, Rajahmundry
Government Handicrafts & Cottage Industries Emporium, Warangal
Government Handicrafts & Cottage Industries Emporium, Anantapur

DIPR.

ఘట్టంలో పైకి కనిపించనిది చాలా ఉన్నది. నా భావాలు నా అంతస్సును పూర్తిగా మార్చలేకుండా ఉన్నాయి. ఆసంగతి నేను సాధ్యమైనమటుకు గుర్తించకుండా ఉండడానికి యత్నిస్తాను. లేకపోతే నా జీవితమూ, పథకాలూ నిర్మూల మైపోతాయి. అలెగ్జాండరు మొదలుకుని అమెరికను కోటీశ్వరులదాకా ప్రపంచవిజేత లందరూ తమ స్వభావాన్ని ఒక కత్తి రూపంలోనో, టంకసాల రూపంలోనో మలుచుకుని, ఆ విస్పష్టమైన ఆకారంతో విజయం సాధిస్తారు.

“నిన్ను నీవు తెలుసుకో,” అనే నినాదాన్ని నేనూ, నిఖిలుడూ కూడా ఇస్తాం. అయితే అతని ధోరణిలో ఎవణ్ణివాడు తెలుసుకున్నా, తెలుసుకోకపోయినా ఒకటే.

“నువు చెప్పే విజయం లభిస్తే ఆత్మను కోల్పోవాలిసొస్తుంది,” అంటాడు నిఖిలుడు.

“అది చాలా అస్పష్టమైన మాట. నీ ఈ ఆత్మ ఎక్కడుంది?” అంటాను.

వాదించుకుంటాం. నిఖిలుడి వాదన అర్థంకాక కాదు. భారతీయుణ్ణిగా పుట్టిన పాపాన ఆధ్యాత్మికవిషం నా రక్తంలోనూ ప్రవహిస్తూనే ఉందిమరి. ఆత్మత్యాగ మనేది నా కెంత అసహ్యమైనా అప్పుడప్పుడూ నేను దాన్ని ఆచరణలో పెడుతూనే ఉంటాను.

విమల, ఉచ్చులో తగులుకున్న లేడిలాగా గిలగిలా తన్నుకుంటున్నది. వేటగాడికి అంతకన్న కావలసిం దేమిటి? నే నా ఉచ్చు బిగించిఉండవచ్చు – కాని ఆపని చెయ్యక సంకోచిస్తున్నాను.

నేను చేతులు చాచి దగ్గిరికి తీసుకుంటే విమల నా వక్షంమీద నిస్సంకోచంగా వాలిఉండే సందర్భాలు కొన్ని తటస్థించాయి. కాని ఆ క్షణాలను నేను వినియోగించక, చెయ్యి జారి పోనిచ్చాను. ఈ దౌర్బల్యం నాలోనే ఉన్నది. నా దృష్టిలో రామాయణానికి అసలు నాయకుడైన రావణు డిలాటి దౌర్బల్యంతోనే నాశన మయాడు. అతను సీతను అంతఃపురంలో పెట్టుకుని అనుభవించక, అశోక వనంలో ఎందు కుంచాలి? భ్రాతృద్రోహి అయిన తన తమ్ముడు విభీషణుడిపట్ల కారుణ్యం ఎందుకు వహించాలి? ఈ దౌర్బల్యమే రావణుడి నాశనానికి దారితీసింది.

నాలో మరొక దౌర్బల్యంకూడా ఉన్నది– నిఖిలుడు నా మిత్రుడు. ఈ కారణంగా నా కప్పుడప్పుడూ లజ్జా, బాధా కలుగుతూ వస్తున్నది. ఇప్పుడిప్పు డతని ఎదట పడాలంటేనే సిగ్గుగా ఉంది; అతన్ని తప్పించుకు తిరుగుతున్నాను.

ఈ దౌర్బల్యా లన్నిటినీ వదలించుకోవాలి. నేను విమలను ఆకర్షించినది వీటితో కానేకాదు. నా కార్యక్రమం కొనసాగితీరాలి. అవతల, దేశం నా కోసం ఎదురుచూస్తున్నది. దాన్నికూడా విడనాడి


# R. K. INDUSTRIES

Mfrs. of Polythene Bags - Tubes - Sheetings etc.

*OFFICE :*

16, STRINGERS STREET
MADRAS - 1

Phones : 23019 & 23526
Care :

*FACTORY :*

VELACHERY MAIN ROAD
VELACHERY, MADRAS - 42

Grams : “PRESUNDRY”
Care :

ద జాప్యం చెయ్యరాదు. ఆ ఉద్యమంతో విమలను జోడింలి. తిరోగమించడానికి మాకిద్దరికీ దారిలేదు.

## నిఖిలుడు చెప్పిన కథ

శ్రావణమాసం వచ్చింది. కాని నా హృదయంలో ఆనందం లేదు. విద్యాపతి చెప్పినట్లు నా యిల్లు శూన్యంగా ఉంది. నా జీవితంలో లోతు లున్నాయిగాని, ఉరవడిలేదు. శక్తితో తొణికిసలాడే విమల నావంటి జడ్డిమనిషితో ఎంతకాలం వేగుతుంది? సాహచర్యం లేక విమల ఇంతకాలమూ తపించిందని నే నిప్పుడు గ్రహిస్తున్నాను.

ప్రతిఏడూ ఈ తరుణంలో మా నౌకాగృహంలో జలవిహారానికి ఇద్దరమూ విధిగా వెళ్ళేవాళ్ళం. విమల కామాట జ్ఞాపకం ఉన్నదా అని నా అనుమానం; నేను మరవలేను.

నేను బాధతో కుమిలినంతకాలమూ విమలకు స్వేచ్ఛ ఉండదు. ఆమెకు స్వేచ్ఛ ఇవ్వాలి; లేకపోతే అసత్యంనుంచి నాకు ముక్తిలేదు.

ఈ ఉదయం పుస్తకం ఒకటి తెచ్చుకుందామని నా గదికి వెళ్ళాను. గదిలో ఆమె ధరించడానికి సిద్ధంగా ఉన్న చీరా, ఆమె ఆభరణాలూ అవీ కనిపించాయి. గుండెలో పొడిచినట్టయింది. ఈ గదిలో నా హృదయాన్ని కట్టేసిన తంతువులు చాలా ఉన్నాయి. తల్లివేరు తెగినా పిల్లవేళ్ళు తెగలే దింకా.

నే నక్కడ ఉండగానే విమల నా వెనకనుంచి గదిలోకి వచ్చింది. క్షమాపణ చెబుతున్నవాడిలాగా పుస్తకంకోసం వచ్చానని గొణిగి, అక్కడినుంచి వెళ్ళిపోయ్యాం. ఆమె ముఖంకేసి చూడడం నాకు సాధ్యంకాలేదు.

పొరుగు నున్న జమీందారీనుంచి పంచూ వచ్చాడు. తట్టనిండా కొబ్బరికాయలు తెచ్చాడు.

“ఏం, పంచూ? దేనికిదంతా?” అంటూ పర్సులోనుంచి డబ్బు తీసి ఇవ్వబోయాను. మా గురువుగారిద్వారా నాకు పంచూగురించి తెలుసు. అతను చాలా పేదవాడు. ధనసహాయం కోరి వచ్చాడనుకున్నాను. కాని అతను తీసుకొనలేదు.

“చేసినపాపం చెప్పేస్తాను. బాబూ! నే నొకప్పుడు బొత్తిగా జరుగుబాటులేక మీ తోటనుంచి కొబ్బరికాయలు దొంగిలించాను. ముసలాణ్ణయిపోయాను. ఏక్షణాన చావొస్తుందో మీ బాకీ తీర్చుకుందామని వీటిని తెచ్చాను,” అన్నాడు పంచూ.

మా గురువుగారంటే పంచూకు చాలాభక్తి. అతను బతుకు తెరువుకోసం అంతులేనికాయకష్టం చేస్తాడు. ఎంత వెట్టిచాకిరి చేసినా అతనికుటుంబం ఏడాదిలో సగంకాలంకూడా రెండుపూటలా కడుపునిండా తిండి తినలేరు. మిగతా ఆరునెల్లూ ఒంటిపూట తిండే.

నే నొకప్పుడు దారిద్ర్యనిర్మూలనంకొరకు కృషి చేద్దామనుకుని ఆమాట విమలతో చెప్పాను. ఆమెకు “తక్కువ” వాళ్ళ కష్టాలను గురించి వేరే అంచనా లున్నాయి. వాళ్ళకష్టాలు వాళ్ళకష్టాలు కావని ఆమె సిద్ధాంతం. ఆమె ఏమంతలేనివాళ్ళమధ్య పుట్టినా రాణివాసపు


THE HYDERABAD ALLWYN METAL WORKS LIMITED

SANATNAGAR P. O. HYDERABAD - 18

Grams: "ALLWYN" Phone No. 36374 (5 Lines)

A LEADING ENGINEERING ENTERPRISE IN ANDHRA PRADESH RICHLY CONTRIBUTING TO THE INDUSTRIAL ADVANCEMENT OF THE NATION

*Manufacturers of:*

Steel Furniture
Refrigerators
Allcut Production
Bandsaw Machine
Hydraulic Hoists
Trailers
Semi-Trailers

Pirani Vacuum Gauge
Halogen Leak Detector
Vacuum Coating Unit
Freeze Drying Machines
Mass Spectrometers etc.

*and*

**Power Tiller to be started shortly**

*Renowned for*

QUALITY — VARIETY — TECHNICAL INNOVATIONS:

*Show-room at*

216 B, GUNFOUNDRY, HYDERABAD

మన స్తత్వంగలది. ఆమెకు నా జీవితంలో పెద్దపీట వేసి, నా సొంత జీవితం చాలా ఇరుకు చేసుకున్నాను. ఆమెను అలంకరించటం లోనూ, విద్యావతిని చెయ్యడంలోనూ, ఆరాధించడంలోనూ నా కాలం వెళ్ళబుచ్చాను. మానవజీవితం ఎంత అమూల్యమైనదో, మానవ జాతి ఎంత విస్తృతమైనదో పూర్తిగా మరిచాను. దైనిక ఘటనలలో మునిగితేలేవాడికి సత్యం మరుగున పడుతుంది. విమల దైనిక ఘట నలకు ఎంత ప్రాముఖ్యం ఇచ్చిందంటే, నేను సత్యానికి చాలాదూరమైపో యాను. ఇప్పుడు నాయిల్లు శూన్యమయింది. ఇంటి నాలుగుగోడల మధ్య ఉన్నదనుకున్న దేవత గోడలవెలుపలనే ఉంటూ వచ్చిందని నా కిప్పుడు తెలిసివచ్చింది ...

క్షయతో చాలాకాలంగా తీసుకుంటున్న పంచూభార్య మరణిం చింది. అతను తన కులంవాళ్ళకు తృప్తి కలిగించటానికి నూట ఇరవైమూడు రూపాయలు ఖర్చు చెయ్యాలి.

"అలాటి బుద్ధిమాలినపని చెయ్యకు పంచూ; వాళ్ళు నిన్నేం చెయ్యగలరు?" అన్నాను కోపంతో.

"నా పెద్దపిల్లకు పెళ్ళికావాలి, బాబూ; నా భార్యకు కర్మ జర గాలి." అన్నాడు పంచూ. అతను మందులఖర్చుకుగాను కొంత భూమి అమ్మాడు. మిగతాది తనఖా పెట్టాడు. ఇప్పుడు బ్రాహ్మణ సంతర్పణ చెయ్యాలి, తప్పదు. వాదించడం నిష్ప్రయోజనం. ఇలాటి దక్షిణలు పుచ్చుకోగల బ్రాహ్మణులు పవిత్రులయే రోజెప్పుడు వస్తుందో తెలీదు.

భార్యకు కర్మ చేశాక పూర్తిగా మునిగిపోయిన పంచూ, సన్యా సుల పాదాలను ఆశ్రయించి, వారినుంచి నేర్చుకున్న తత్వ జ్ఞానంతో తన పిల్లలు తిండికి మాడుతున్న మాట మరిచిపోగలి గాడు. ప్రపంచ మంతా మిథ్య. కష్టసుఖా లన్నీ మాయాకల్పితాలు. ఈ జ్ఞానంతో ఒకనాడతను పిల్లల్ని వదిలిపెట్టి ఇంటినుంచి వెళ్ళిపోయాడు.

ఒకనెల గడిచేసరికి పంచూ వైరాగ్యం చాలావరకు తుడిచిపెట్టుకు పోయింది. ఈలోపల అతని బిడ్డలను మా గురువుగారు చేరదీసి కాపాడారు. ఆయనే పంచూకు కొంత పెట్టుబడిధనం ఇచ్చి, చిల్లర వ్యాపారం ఏదైనా చేసుకోమన్నారు. అతను బట్టలఅమ్మకం ప్రారంభించాడు. ఈదశలో స్వదేశీఉద్యమం అతన్ని ఉప్పెనలాగా తాకింది.

శలవురోజులు — మా చుట్టుపట్లగల గ్రామాల యువకులు స్కూళ్ళనుంచీ, కాలేజీలనుంచీ ఇళ్ళకు వచ్చి, సందీపుడి నాయకత్వంతో ఆవేశం పొందారు. ఒక్కనాడు వాళ్ళంతా కలిసి నాదగ్గిరకి వచ్చి, మా జమీందారీ మార్కెట్టునుంచి విదేశీవస్తులను బహిష్క రించనందుకు ఆక్షేపణ తెలిపారు ఆపని నావల్ల కాదంటే, "అంత నష్టం భరించలేరా, మహారాజా?" అని అధిక్షేపణగా అడిగారు.


పేరుపొందిన చికిత్స

జమ్మివారి లివర్‌క్యూర్

పసిబిడ్డల లివర్, స్ప్లీన్ వ్యాధులకు పరమౌషధము

**వ్యాధి లక్షణాలను ఆదిలోనే గుర్తించండి:**

ఆకలి మందగించటం — అజీర్ణం — చిరాకుగా ఏడుస్తూండటం — కొంచెంగా జ్వరం — పొట్ట పెరగటం — మట్టిరంగుగా లేదా తెల్లగా విరేచనం.



జమ్మివారి డాక్టర్లు ముఖ్యమైన పట్టణాలకు ప్రతి నెలా వస్తారు.
వివరాలకు వ్రాయండి:

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్

హెడ్ ఆఫీసు: మద్రాసు-4.

బ్రాంచీలు: బొంబాయి-4 — బెంగుళూరు-2 — కలకత్తా-7 — ఢిల్లీ-6 — కుంభకోణం — లక్నో — నాగపూరు-1 — తిరుచిరాపల్లి-2 —

JV14-TE

ఇతర మందులు

జమ్మివారి

మిల్క్ ఆఫ్ మెగ్నీషియా

మృదువిరేచనకారి.

"కాల్డటోన్" (రిజిష్టర్డ్)

"ఆయుర్వేదిక్ ఐరన్ కాంపౌండ్‌తో చేరిన మిక్చర్ ఆఫ్ కేల్సియమ్ కాంపౌండ్స్ పౌడర్"

బిడ్డలు పెరిగే కాలములలో, సరియైన బరువు, బలము లేకుండుట, ఆకలి మందగించుట, చురుకుదనము లేకుండుట, రక్తహీనత. యీ మొదలగు గుణములున్న అవస్థలలో, పిల్లలకు ఉపయోగించతగిన టానిక్.

"హూకో" (రిజిష్టర్డ్)

కోరింత దగ్గుకు.

"న్యూట్రిటోన్" (రిజిష్టర్డు)

ఆకలి కలిగించుటకు, జీర్ణకారిగా ఉండుటకు టానిక్.

జమ్మి వెంకటరమణయ్య & సన్స్ 'మహేంద్ర నివాస్'

వివేక్‌నగర్, ముషీరాబాద్ - పోస్టు: చిక్కడపల్లి, హైద్రాబాద్-20, ఎ. పి.

అప్పుడక్కడే ఉన్న మాగురువుగారు, "నష్టం అతనికేగాని మీ కేమీ ఉండదనిమాట నిజమేకదా!" అన్నారు.

అసలు సంగతేమంటే నేను విదేశీ బహిష్కరణ అమలుచేస్తే మా మార్కెటులో దుకాణాలు పెట్టుకున్న వర్తకులు నష్టపడిపోతారు.

"కాని దేశంకోసం ___" అన్నారు యువకులు.

"దేశమంటే మట్టికాదు మనుషులు. వాళ్ళ గతి ఏమవుతున్నదీ మీ రేనాడైనా పట్టించుకున్నారా? లేదు. వాళ్ళే ఉప్పు తినాలో, ఏ బట్టలు కట్టాలో శాసించడానికిమటుకు సిద్ధమయారు," అన్నారు గురువుగారు.

"మేము దేశీ ఉప్పూ, దేశీ చక్కెరా, దేశీ బట్టలూ వాడుక చేస్తున్నామే," అన్నారు యువకులు.

"మీరు చేస్తే చేసుకోండి. పేదవాళ్లు మిమ్మల్ని నిర్బంధించడం లేదు. కాని ఆ పేదవాళ్ళది పైసా అంటే ఏమిటో కూడా మీ రెరగరు. ఇదివరకల్లా మీరు హుందాగా బతికి, ఇవాళ మీ కసి తీర్చుకోవడానికా పేదవాళ్ళను సాధనంగా ఉపయోగించ జూస్తున్నారు. అది పిరికితన మంటాను," అన్నారు గురువుగారు.

యువకులంతా ఆయన శిష్యులే. అందుచేత లోపల ఉడికిపోతున్నా పైకి ఆయనను అవమానించలేక నాతో, "మీ రొక్కరే ఉద్యమానికి విఘాతం కలిగించ నున్నారా, మహారాజా?" అని అడిగారు.

"నే నెందుకు విఘాతం కలిగిస్తాను. అవసరమైతే నా ప్రాణాలు కూడా అర్పిస్తాను," అన్నాను. నేను మిల్లుదారం బేళ్ళకొద్దీ ఇతర జమీందారీలకు పంపాననీ, మా మార్కెటులో అమ్మకానికి పెట్టాననీ చెప్పాను. దాన్ని ఎవరూ కొనడం లేదని వాళ్ళు చెప్పారు. అది నా తప్పెలా అవుతుంది? ఈ యువకులలాగా ప్రజలందరూ స్వదేశీ దీక్ష పూనలేదు. దేశీ నూలు నేను నా కళ్ళతోనే కొన్నాననీ, నేయించాననీ, అందువల్ల నేతబట్టల ఖరీదు జరీపేటు ఖరీదంత అయిందనీ, దాన్ని చివరకు నేను కిటికీల కర్టెన్లుగా వాడుకోవలసి వస్తుందనీ, ఈలోపల ఈ యువకులు స్వదేశీ దీక్ష వదిలేసి వచ్చి, ఆ కర్టెన్లను చూసి నవ్వబోతారనీ, ఎప్పటికైనా నేతబట్టల అందాన్ని విదేశీయులే గ్రహించగలరనీ గురువుగారు యువకులకు చెప్పారు.

అంతా విని వాళ్ళు నన్ను, "అయితే ఇంతకూ మీ మార్కెటు నుంచి విదేశీవస్తువులు బహిష్కరించరా?" అని ఆఖరుసారి అడిగారు.

"బహిష్కరించను. ఆ వస్తువులు నావి కావు," అన్నాను.

"వందేమాతరం" అని కేకపెట్టి వాళ్ళు వెళ్ళిపోయారు...

ఇది జరిగిన కొద్దిరోజులకు గురువుగారు పంచూను నావద్దకు


LOOK TRIM & SMART
IN YOUR WASH & WEAR
WHEN WE TREAT THEM WITH OUR
PROFESSIONAL CARE
27 YEARS OF CONTINUEOUS PROGRESS
FOR
QUALITY DRY-CLEANING

*H. O. & Works*
*R. P. Road*
*Secunderabad*
Phone : 74840

A-1 DYERS & DRY-CLEANERS
(Estd. 1939)

*Branches :*
Nampally, Phone : 34216, Ameerpet, Mareedpally, Warangal & Hanamkonda

PURCHASE OUR CONCESSION COUPON BOOKS
AND SAVE 20% DISCOUNT



తెచ్చారు. పంచూ పెద్దచిక్కులో పడ్డాడు. వాళ్ళ జమీందారు హరీశకుందుడు, విదేశీవస్త్రాలు అమ్ముతున్నందుకు పంచూకు నూరు రూపాయిలు జరిమానా విధించి, జమీందారీనుంచి వెళ్ళగొడతా నని బెదిరించాడట. తనదగ్గిర ఉన్న సరుకు అమ్ముకోనివ్వమని పంచూ జమీందారును బతిమాలి, ఇంకెన్నడూ విదేశీ వస్త్రం అమ్మ నని మాట ఇచ్చాడట. విదేశీ వస్త్రాలన్నీ అప్పటికప్పుడే దహనం చెయ్యా లని జమీందారు పట్టుపట్టాడట.

"అరువు తెచ్చికొన్న సరుకు, తగలబెట్టి నష్టపడలేను. తమరు శ్రీమంతులు. కావలిస్తే సరుకు కొని తగలెయ్యండి!" అని పంచూ అన్నాడట.

జమీందారు మండిపడి పంచూను చెప్పుచెబ్బలు కొట్టించాడు. అతని విదేశీ సరుకు తగలబెట్టనే పెట్టారు. చూట్టూ చేరినవాళ్లు "వందేమాతరం" అని అరిచారు.

సందీపు డక్కడే ఉన్నాడు. అతను విదేశీవస్త్రాల బూడిద తీసి, "మీ గ్రామం విదేశీ వర్తకానికి అంటించిన మొదటిచితి ఇదే. ఈ చితాభస్మాన్ని మీ దీక్షాచిహ్నంగా ధరించండి," అని అక్కడ ఉన్న తన అనుచరులను హెచ్చరించాడు.

పంచూ ఈ విషయాలు నాకు చెప్పాడు. నేను వాణ్ణి కేసు పెట్ట మన్నాను. తనకు సాక్ష్యం ఎవరొస్తా రన్నాడు పంచూ. నేను సందీపుణ్ణి కేకపెట్టి పిలిచి, "ఈ మనిషి బట్టలమూట తగలబెట్టారని మవు సాక్ష్యం ఇవ్వవా?" అని అడిగాను.

సందీపుడు చిరునవ్వు నవ్వి, ''నేను తప్పక సాక్ష్యం ఇస్తాను— అవతలిపక్షాన,'' అన్నాడు.

నిజం చెప్పేదానికి ఒకపక్షాన సాక్ష్యం ఇవ్వడ మేమి టన్నాను. కళ్ళకు కనబడేది మాత్రమే నిజం కాదన్నా డతను. సత్యాన్ని సృష్టించాలట. గడ్డిలాగా తనంతట మొలిచేది నిజం కాదట. పైకి వచ్చినవా ళ్లెవరూ సత్యాన్ని గుడ్డిగా అనుసరించలేదట. సత్యాన్ని సృష్టి చేశారట. అలా సృష్టించిన సత్యంలో అబద్ధం చాలా చేర వచ్చుట.

ఇద్దరమూ కొంతసేపు వాదించుకున్నాక మా గురువుగారు, ''తర్కించి లాభంలేదు, నిఖిల్. సత్యమనేది తమలో లేనివాళ్ళు, దాన్ని వెతికి తేలేరు—బాహ్యపదార్థాలను జాస్తిగా పోగుచేస్తారు," అన్నారు.

''నిజమేనండీ. బడిపంతులు చెప్పవలసిన మాటలు చెప్పారు. ఇలాటి మాటలు పుస్తకాలలో చాలా చదివాను. కాని వాస్తవ జీవితంలో మనిషియొక్క ప్రధానకర్తవ్యం బాహ్యవస్తువులను పోగెయ్యడమే. ఆకళ తెలిసినవారు తమ వస్తువులను బ్రహ్మాండమైన అబద్ధాల సహాయంతో అమ్ముకుంటారు; తమ రాజకీయ చిఠాలలో తప్పుడు లెక్కలు వేస్తారు; తమ వార్తాపత్రికల నిండా అబద్ధాలు గుప్పిస్తారు; ఈగలు రోగాలను వ్యాప్తి చేసినట్టుగా, అసత్యప్రబోధం ప్రచారం చెయ్యడానికి తమ ఏజెంట్లను పంపకం చేస్తారు; వాళ్ళ ఆశయం సత్యం కాదు, విజయం."

"నిజమైన విజయం," అన్నాడు గురువుగారు.

"అయ్యో, నిజమైన విజయం పంట చెయ్యాలంటే భూమిని బద్దలుకొట్టి, మట్టిని నలిచి, పొడిపొడి చెయ్యాలి. దానంతట అదిగా పెరిగే సత్యం క్రిములకు ఆహారంగా కూడా పనికి రాదు," అంటూ సందీపుడు వెళ్ళిపోయాడు.

మా గురువుగారు నాకేసి నవ్వుతూ, సందీపుడు వట్టి నాస్తికు డనుకున్నాను. అతనిమతం అమావాస్య చంద్రుడిలాటిది. కాంతి యావత్తూ అవతలివైపున ఉన్నది," అన్నారు.

"అందుకే అతనితో ఏకీభవించలేకపోయినా, అతన్ని గర్హించ లేను. నాకతను ఎంత బాధ కలిగించినా, ఇకముందు కలిగించ నున్నా, నాకతనిమీద ప్రేమ ఉండనే ఉన్నది," అన్నాను.

పంచూ సమస్య అలాగే ఉండిపోయింది. పంచూ ఆస్తిని నేనే కొని, నా జమీందారీలో అతనికి ఆస్తి ఇద్దా మనుకున్నాను. తననూ, పిల్లలనూ ఇంటో పెట్టి కొంపకు నిప్పు పెడతారని పంచూ భయ పడ్డాడు. అతని పిల్లలపూచీ నేను తీసుకుంటాననీ అతను తన యిష్టంవచ్చిన వ్యాపారం చేసుకోవచ్చుననీ చెప్పాను.

పంచూ ఇల్లూ వాకిలీ నేను కొని స్వాధీన పరచుకోబోయేసరికి ఆ ఇంటిమీద తనకు హక్కున్నదంటూ ఎవరో ఆవిడ రుద్రాక్షమాలలతోసహా, ఒక విధవరాలిని వెంటబెట్టుకువచ్చి ఇంట్లో తిష్ఠవేసింది. తాను పంచూ పెత్తండ్రి భార్య నన్నది. పంచూ పెత్తండ్రి భార్య పోయింది; భర్త పోయినాకనే పోయిందికూడా. ఈమె పంచూ పెత్తండ్రి రెండో భార్యట. మొదటిభార్య ఉండగానే ఈమెను

చేసుకున్నా డని చెప్పారు. ఈ వివరాలన్నీ హరీశకుందు జమీందారు కింది ఉద్యోగులకు బాగా తెలుసుట. కావలిస్తే పెళ్ళిభోజనం తిన్న వాళ్ళను సాక్ష్యంకూడా తెస్తా మన్నారు. పంచూమాత్రం ఇది కొంచెం కూడా ఎరగడు !...

ఒకనాటి ఆపరాహ్ణం నేను పనిలో ఉండగా లోపలినుంచి విమల పిలుస్తున్నట్టు కబురు వచ్చింది. ఆత్యాశ్చర్యంతో నేను లోపలికి వెళ్ళాను.

"చూడండి, మన మార్కెటు ఒక్కటే విదేశీవస్తువు లమ్మ తోందడం ఏమైనా బాగుందా?" అన్నది విమల.

"ఏం చేస్తే బాగుంటుంది?" అన్నాను.

"వాటిని తీసెయ్యమనండి."

"అవి నావి కావే!"

"మార్కెటు మీదేగా?"

"ఎవ రక్కడ వర్తకం చేసుకుంటున్నారో వారిదే చాలా వరకు."

"అలా అయితే స్వదేశీ వస్తువులే అమ్మమనండి."

"నాకు మరీ సంతోషం; కాని వాళ్ళు వినకపోతే?"

"అదేంమాట? వాళ్ళకంత పొగరా? మీరుకాదా ఆ మార్కెటుకు—"

"నే నీపూట చాలా పనిమీద ఉన్నాను. వాదించడానికి వ్యవధి లేదు. కాని ఒత్తిడి చెయ్యడం నావల్లకాదు."

"స్వార్థంతో చేసేవత్తిడి కాదుగద – దేశంకోసం."

"దేశంకోసం ఒత్తిడి చెయ్యడం దేశాన్ని ఒత్తిడి చెయ్యడమే," అంటూ వచ్చేశాను.

ఇంత కాలానికి నా మనసు తేలికనపడి, ఏదో అవ్యక్తమైన ఆనందం నన్నామోదించింది. ఆ ఆనందానికి కారణం ఆలోచించిన మీదట బయటపడింది. నాచేత సరే ననిపించడానికి విమల చాలా అందంగా ముస్తాబయింది. ఇదివరకు విమల ముస్తాబును విమలలో ఒక భాగంగానే చూస్తూ వచ్చాను. ఒక తుచ్ఛ ప్రయోజనంకోసం చేసుకున్న ముస్తాబని తెలియగానే నా బ్రతుకు పటాపంచలయింది. సత్యం జయించింది. నాకు నా మనోవేదననుంచి విముక్తి లభించింది. ధన్యుణ్ణి.

## సందీపుడు చెప్పిన కథ

ఆరోజు విమల పిలిస్తే వెళ్ళాను. కాని ఆమె చాలాసేపు నోట మాటలేక, గుడ్లనీళ్ల కుక్కుకున్నది. ఆమె నిఖిలుణ్ణి ఒప్పించలేక పోయిందని గ్రహించాను. ఆమె తప్పక జయిస్తా ననుకున్నది. ఆడదానికి మగవాడి బలహీనతలు తెలిసినట్టుగా లోతులు తెలియవు. ఆమె, పని జరగనందుకు కాక, తన అభిమానం దెబ్బతిన్నందుకు వాపోతున్నది!

ఆ క్షణంలో విమల నాకు చాలా ముద్దొచ్చింది. ఆమె చెయ్యి పట్టుకుని తీసుకుపోయి కూర్చోబెట్టాను. అమె తనచేతిని విదిలించు


*Please Visit:*

HEAD OFFICE

**Ashok DRESSES**

Sultan Bazar

BRANCH OFFICE

**Dress Centre**

Sultan Bazar

HYDERABAD

*Manufacturers of:*

QUALITY

FANCY

GARMENTS

**Mandal APPARELS**

STATION ROAD, HYDERABAD - A. P.

Phohe: 46047

*Stockists:*

WOOLLEN

HOSIERIES

HANDLOOM

&

BANIANS

Phone: 43077

Residence Phone: 35515

కోక, నావెంట వచ్చింది. కాని ఆక్షణంలోనే ఏకారణంచేతనో నా ఉద్రేకపుపొంగు చాల్లారిపోయింది. నన్ను నిరోధించినభావం ఇదీ అని స్పష్టంగా చెప్పలేను. అందుకే నేనెటువంటివాణ్ణో నాకే తెలీదు.

నే నామెతో భవిష్యత్కార్యక్రమం చర్చించ నారంభించాను. కాని ఆమె వినే స్థితిలో లేదు; సాయంకాలం కలుస్తానని చెప్పి, లేచి వెళ్ళిపోయింది. అప్పుడు నాకు పశ్చాత్తాపం కలిగింది - మంచి అవకాశాన్ని జారవిడిచి, ఆమెకు నిరుత్సాహం తెప్పించిఉంటానని.

ఇంతలో అమూల్యుడు వచ్చి ఉద్యమం ఎక్కడెక్కడ ఎలా సాగుతున్నదీ చెప్పాడు. హరీశకుందుజమీందారుకింద ఉండే వర్తకులు దాదాపు అందరూ మాపక్షం అయారు. నిఖిలుడికింది ఉద్యోగులు చాలామంది రహస్యంగా మాపక్షమే. తమ దగ్గిర ఉన్న సరుకు అమ్ముకోనిస్తే పరిహారం ఇస్తామంటున్నారు మార్వాడీవర్తకులు. కొద్దిమంది ముస్లిము వర్తకులే లొంగిరాకుండాఉన్నారు.

ఒక ముస్లిము వర్తకుడి జర్మను శాలువల మూటను మా కుర్రవాళ్లు పట్టుకుని తగలబెట్టేశారు. వాడికి స్వదేశీ శాలువలు ఇస్తామన్నాం. కాని కాశ్మీరుశాలువలు పరిహారం ఇవ్వాలంటే మాటలా? నిఖిలుడు.వాణ్ణి కేసు పెట్టమన్నాడట. గెలిచినప్పుడు చూస్తాం. నిఖిలుడి లాయరుకూడా రహస్యంగా మా పక్షమే.

పడవలవాళ్లు చాలామంది మా పక్షమే; విదేశీసరుకు చేరవెయ్యమన్నారు. కాని వాళ్ళ నాయకుడు మీర్‌జాన్ మొరాయిస్తున్నాడు. వాడి పడవ ముంచెయ్యమని మా వాళ్ళకు చెప్పాను. ఒడ్డున కట్టి ఉన్న పడవకు బెజ్జంపెట్టి, కట్టుతాడు కోసి ప్రవాహానికి వదిలారు. నదిప్రవాహంలో పడవ మునిగింది.

మీర్‌జాన్ పరిస్థితి గ్రహించి, తనతప్పు ఒప్పుకుని, కాళ్ళావేళ్ళా పడి, ఈసారికి తప్పు కాయమనీ, తన పడవ ఖరీదు రెండు వేలనీ ఏడిచాడు. పదిరోజులు తాళి రమ్మన్నాను.

డబ్బు ఎక్కడ పుట్టించేటట్టు? పుష్కలంగా డబ్బుంటే గాని ఉద్యమం విజయవంతం కాదు. విమలదగ్గిరికి వెళ్ళి, "రాణీ, మనకు విజయం కనుచూపుమేరలో ఉన్నది. డబ్బే జరూరుగా కావాలి," అన్నాను.

"ఎంత?" అని అడిగింది విమల.

"ఎంతో అక్కర్లేదు. ప్రస్తుతానికి యాభై వేలు చాలు."

విమల తన నగ లమ్మి ఇచ్చే ధోరణిలో కనబడింది. వాటిని అవసరానికి ఉండనివ్వ మనీ, ఇప్పటిమటుకు నిఖిలుడినుంచే డబ్బు సంపాదించా మనీ అన్నాను.

"నా కెలా వస్తుంది?"

"అతనిడబ్బు నీది కాదా?"

"కాదు."

"కాకపోతే అతనిదీ కాదు, దేశానిది. ఎలాగైనా నువు ఆ డబ్బు






సంపాదించక తప్పదు. వందేమాతరం మంత్రంతో ఇనప్పెట్టెల తలుపులు కూడా తెరుచుకుంటాయి. వందే మాతరం!"

"వందే మాతరం!"...

ఒకటి రెండువేలు తెమ్మంటే బిచ్చంలా గుంటుందని విమలను యాభై వేలు తెమ్మన్నానేగాని, ఆమెకు అంత డబ్బు చిక్కేదాక నమ్మకంలేదు. ఒకటి రెండువేలే చిక్కినా నిజానికి చాలు.

ఇంకో చిక్కు వచ్చింది. బోటు ముంచినవాడి ఆచూకీ పోలీసులకు దొరికినట్టున్నది. వాడు పాత కేడీట. నిఖిలుడు చాలా పట్టుదల మీద ఉన్నాడు. అతని మేనేజరు భయపడుతున్నాడు. తన కేదన్నా చిక్కు వచ్చేటట్టుంటే నన్ను బయటపెట్టవలసి వస్తుందన్నాడు. నేను రాసిన ఉత్తరం ఒకటీ, అమూల్యుడు రాసిన ఉత్తరాలు అనేకమూ అతనివద్ద ఉన్నాయట.

పోలీసులకు లంచం పొయ్యాలి. మిర్జాన్ చేతిలో ఎంతో కొంత పెట్టి, వాడి నోరు కట్టాలి. స్వదేశీఉద్యమాని కయే ఖర్చులో కొంత నిఖిలుడి మేనేజరు జేబులోకి పోవటం తథ్యం. వందే మాతరం అని మాతోపాటు అరుస్తున్నాడు. తింటే తిననీ. ఆ మాటకు వస్తే నా అవసరాలుకూడా ఈ ఖర్చులో చేరేవే...

ఉద్యమం జోరుగా సాగుతున్నది. ముసల్మానులు మా సోదరులని గొంతులు చించుకుని అరుస్తున్నామేగాని, వాళ్ళు పూర్తిగా కలిసిరాకుండా ఉన్నారు. వాళ్ళ భరతం పట్టి, మేమే యజమానుల మని తెలియజెప్పాలి. నిఖిలుడు ఒప్పుకోడు; ఐక్య భారతంలో ముస్లిములకు స్థానం ఉందంటాడు. ముస్లిములు అలజడి కలిగిస్తారంటే, అలజడిని అలజడితో నివారించలే నంటాడు. అతనివన్నీ నీతిపాఠాలు.

నేను చాలాకాలంగా ఒక పథకం ఆలోచించి ఉంచాను. దేశ ప్రజలలో దేశభక్తి రేకెత్తించాలంటే దేశమాత స్వరూపాన్ని వాళ్ళ కళ్ళముం దుంచాలి. అలాటి భ్రమలు కూడ దంటాడు. పని పాడు చేసుకునే కన్న అబద్ధపు దేవతలను సృష్టించటం మేలు అంటాను నేను. బ్రాహ్మణు లున్నారు; కాని వాళ్ళవల్ల ఏ పనీ కాకుండా వృథాగా ఉన్నారు. దేశమాత నాకు కలలో కనిపించిం దంటాను. బ్రాహ్మణులను ఆమెకు పూజారులుగా వుండమంటాను. ఈ సందేశం జనాని కందినప్పుడు అద్భుతమైన పరిణామా లుండబోతాయి. బెంగాలు ముస్లిముల ఏలుబడిలో కుమిలిపోతున్నప్పు డుద్భవించిన రాజకీయ దేవత దుర్గ. ఏ ఇతరరాష్ట్రిమూ తన ఆదర్శానికి అలాటి రూప కల్పన చేయలేదని నిఖిలుడితో అన్నాను.

ముసల్మానులు ఏలేటప్పుడు మహారాష్ట్రిలూ, సిక్కులూ కత్తులు ధరించారు, ఫలితాలు పొందారు. ఒక్క బెంగాలీలే దేవి చేతిలో కత్తులూ కటార్లూ పెట్టి, మంత్రాలు చదివి, గొర్రెల తలలూ, దున్నల తలలూ ప్రసాదంగా స్వీకరించారు." అన్నాడు నిఖిలుడు ...

నిఖిలుడి ఎస్టేటులో రుయిమారీ వద్ద ఏటా జరిగే జాతరలకు లక్షలాది జనం వస్తారు. ఆ సమయంలో అక్కడ దేశమాత పూజ జరిపితే బాగుంటుందని నిశ్చయించాను. అధమం అయిదువేలైనా తీసుకురాకపోతే పనిజరగ దని విమలను హెచ్చరించాను.

## నిఖిలుడు చెప్పిన కథ

స్థానిక పత్రికలలో నాపైన వ్యాఖ్యలూ, ఉత్తరాలూ పడుతున్నాయి. వ్యంగ్యం చిత్రాలూ, రచనలూ కూడా రాబోతాయట. నా ఎస్టేటులో అందరికీ స్వదేశీఉద్యమం ఇష్టమనీ, నా జులుముకు భయపడి పైకి ఆమాట అనలేకుండా ఉన్నారనీ, సాహసించి నాకు ఎదురుతిరిగినవాళ్ళను అణచిపారేశా ననీ, పోలీసులతో లాలూచీ అయి, మేజిస్ట్రేటుతో రహస్యసంప్రదింపులు చేస్తూ, ఉన్న బిరుదులకు కొత్తవి తగిలించుకో జూస్తున్నాననీ ప్రచారం చేస్తున్నారు. జమీందార్లు కుందూ, చక్రవర్తులను పత్రికలు తెగ పొగడేస్తున్నాయి. ఉద్యమానికి తోడ్పడని దేశద్రోహులైన జమీందార్ల జాబితా ఇస్తూ, వాళ్ళ ఖజానాలు ఎలా పరశురామప్రీతి అయినదీ వివరిస్తూ రక్తాక్షరాలతో ఒక ఆకాశరామన్న ఉత్తరం ప్రకటితమయింది.

ఇవన్నీ చేస్తున్న స్థానికవిద్యార్థులను పిలిపించి, వారితో మాట్లాడాను. దేశం అధోగతికి వచ్చినది. అనేకరకాల భయాలతో— దేవుడి భయము లగాయతు పోలీసు భయందాకా. మరికొన్ని కొత్త బూచులను ఎందుకు సృష్టిస్తారు?" మీ విజయపతాకను భయాలమీద నెలకొల్పే పక్షంలో నిజమైన దేశాభిమాను లెవరు మిమ్మల్ని బలపరుస్తారు?" అని అడిగాను. ప్రజలను భీతినుంచి కాపాడినంత మటుకే ఏ ప్రభుత్వమైనా విజయం సాధించిన దన్నాను.

నామాటలు విద్యార్థుల తల కెక్కలేదు. చక్రవర్తిజమీందారు



తన శిస్తుకోసం ఒకడిచేత భార్యను అమ్మించాడట! అలాటి పనులు చెయ్యగలవాళ్ళే సమర్థులనీ, నాబోటివాళ్లు వాజలనీ సందీపుడు విద్యార్థులకు బోధించాడట. చరిత్రకు నాయకులందరూ కుండూ. చక్రవర్తి జమీందార్లవంటివారే నని విద్యార్థులు నమ్ముతున్నారు!

పంచూ దొడ్డమ్మ ఒకసమస్య అయింది. ఆవిడ అతడి పెత్తండ్రి భార్య కాదని రుజువుచెయ్యటం తేలికకాదు. జరిగిన సంఘటనలకు సాక్షులు కొద్దిమందే ఉంటారు, కాని జరగనివాటికి ఎంతమంది సాక్షుల నైనా పోగుచేసుకురావచ్చు.

ఈ పరిస్థితిలో మా గురువుగారు ఈ సమస్యను పరిష్కరించ డానికి పూనుకుని బయలుదేరి వెళ్ళారు. ఏం చేద్దామని ఆయన ఉద్దేశమో నాకు అర్థం కాలేదు.

మొన్నటిసాయంకాలం నాకు చేసే పనేమీ లేకపోయింది. మాట్లాడుకోడానికి గురువుగారుకూడా లేరు. లోపలి పూలతోటకు బయలుదేరాను. నాకు చేమంతిపూలంటే చాలా ఇష్టం. రకరకాల చేమంతులు తొట్టెలలో తోట గోడవెంబడి బారులుగా పేర్చి ఉంటాయి. వాటిని చూసి, చాలారోజు లయిందని అక్కడికి బయలుదేరాను.

నే నక్కడికి చేరేసరికి పూర్ణచంద్రుడు గోడమీదికి వచ్చి ఉన్నాడు. నేను చేమంతులను చేరబోయేసరికి ఎదురుగా గడ్డిమీద ఎవరో పడుకుని ఉండటం కనబడి గుండె గుబుక్కుమన్నది. నా అడుగుల చప్పుడు కామె లేచి కూర్చున్నది. చప్పున వెళ్ళిపోతే బాగుంటుందన్న ఆలోచన నాలో కలిగిన క్షణంలోనే ఆమె తన చీరచెరగు నెత్తిమీదికి లాక్కుని లోలపకి వెళ్ళిపోయింది.

"విమలా!''

ఆమె ఆగిందిగాని తిరిగిచూడలేదు.

"నిన్ను నా పంజరంలో బంధించిఉంచి ఏం ప్రయోజనం? నాకు మనోవేదన తప్ప!...నువు పూర్తిగా స్వతంత్రురాలివి. నీకు విముక్తి నిస్తేగాని నాకు విముక్తి లేదని నిశ్చయానికి వచ్చేశాను." అన్నాను.

నేను నా గదికి తిరిగివచ్చేసరికి గురువుగారు వచ్చిఉన్నారు.

"ఇన్నాళ్లూ ఎక్కడ ఉన్నారు?'' అని అడిగాను.

"పంచూ ఇంట అతని పెత్తల్లినని చెప్పుకునే ఆవిడ సంగతి తేల్చాలనిపించింది. నేను ఏమైనా సరే అక్కడే ఉండబోతున్నా ననీ, నే మున్నంతకాలమూ పంచూ కూడా ఉంటాడనీ ఆమెకు స్పష్టంగా చెప్పేశాను. రెండురోజు లయాక మూటాముల్లే సర్దు కున్నది. బృందావనానికి పోతా ననీ, ఖర్చు లివ్వమనీ అన్నది. అందుకే నీ దగ్గిరికి వచ్చాను," అన్నా రాయన.

ఇస్తా నన్నాను.

## విమల చెప్పిన కథ

మార్కెటునుంచి విదేశీ వస్తువులు బహిష్కరించ మని నా భర్తను అడగా లని నిశ్చయించుకున్నప్పుడు వాగ్వాదం జరుగుతుం దని నాకు తెలుసు. కాని నేను సందీపుణ్ణి సమ్మోహితుణ్ణి చేసిన శక్తి తోనే నా భర్తనూ జయించగల నని గట్టిగా నమ్మాను. కాని జరిగిన దేమిటి? ఆయనలో ఎలాటి చలనమూ లేదు. ఆయన నా పైన మండి పడినా బాగుండిపోను. నేను చీకటిలో కరిగిపోయే కల అంత అవాస్తవంగా నాకే తోచింది.

తరవాత మొన్న నా భర్త నాకు స్వేచ్ఛ ఇస్తా నని ఎంత తేలిగ్గా అన్నాడు! స్వేచ్ఛ అన్నది అంత తేలిగ్గా ఇచ్చిపుచ్చుకునేదా? చేపను గాలిలోకి విసిరి స్వేచ్ఛ ఇస్తున్నానంటే అదేం స్వేచ్ఛ — శుష్క స్వేచ్ఛ.

నా జీవితంలో వాస్తవమైన దేమైనా మిగిలిఉంటే, అది సందీపుడే. అతనికి యాభై వేలిస్తా నన్నాను. ఎక్కడ తెచ్చేట్టు?

అమూల్యుడికి కబురు చేసి పిలిపించి, "ఉద్యమానికిగాను డబ్బు కావాలి. ఖజానానుంచి డబ్బు తీయగలవా?" అని అడిగాను. తెస్తా నన్నాడు. ఎలా తెస్తా వన్నాను. వాడు చెప్పిన పద్ధతు లన్నీ కుర్ర తనపు బుద్ధులుగా ఉన్నాయి. బజారు కొల్లగొట్టి, షరాబుకు లంచం పెడతా నన్నాడు. అది కుదరదంటే షరాబును హత్య చేస్తా నన్నాడు. పెర్రి ఆవేశంతో వాదించాడు; "చంపే దెవరు? చచ్చే దెవరు?" అని భగవద్గీతనుంచి చదివాడు.

నాకు ఆ కుర్రవెధవను చూస్తే జాలివేసి, మాతృత్వం పొంగి వచ్చింది. దేశమాత ఇలాంటి అర్భకుల నెందుకు కాపాడలేదు? కాని నేనైనా వాడికి నీతి బోధించే స్థితిలో ఉన్నానా? ఒక్క క్షణం కిందనే గదా వాణ్ణి దొంగతనం చెయ్యమని అడిగాను?

"నువ్వేమీ చెయ్యవద్దు, అమూల్యా. డబ్బు సంగతి నేను చూసు



కుంటాలే." అన్నాను. వాడివద్ద ఒక చిన్న పిస్తోలున్నది. దాన్ని అడిగి తీసుకుని, "బాబూ, ఇవాళనుంచీ నేను నీ పెద్దక్కను. నిన్ను భగవంతుడు సన్మార్గాన నడిపించుగాక !" అని ఆశీర్వదించాను. వాడు నన్ను అక్కనుగా ఆమోదించి నాకు వందనం చేసి, పిస్తోలు నా కిచ్చాడు.

మర్నాడే సందీపుడు కనిపించేసరికి నాకు మళ్ళీ మైకం కమ్మింది. అతను అవసరంగా అయిదువేలు కావాలన్నాడు. ఎలాగో ఇస్తాను; ఇచ్చి తీరుతాను.

దుర్గపూజకు ముందు ఏటా నా భర్త మా తోడికోడలికి ఆరువేల రూపాయ లిస్తాడు. అది ఆమె పేర కలకత్తా బాంకులో జమ పడుతుంది. ఈ యేడింకా ఆయన పట్నం వెళ్ళలేదు. ఆ డబ్బింకా నా భర్త ఇనప్పెట్టెలోనే ఉన్నది. దాని తాళంచెవులు నా భర్త రాత్రి వేళ విడిచే దుస్తుల్లోనే ఉంటాయి. ఆ తాళపుచెవులు తీసి, ఇనప్పెట్టె తెరిచాను. దాని సొరుగులో డబ్బు సవర్లరూపంలో కాగితంలో పొట్లం కట్టిఉన్నది. ఆ పొట్లం తీసి నా చీరచెంగున మూట గట్టుకున్నాను. అదే నోట్లకట్టలైతే ఇంతగా దొంగతనం అనిపించి వుండకపోను.

నేను నా గదికి తిరిగి వచ్చి, నా పవిత్రత అంతా కోల్పోయినట్టు భావించుకుంటూ, వందేమాతరం జపించసాగాను. ఈ దొంగతనంతో నేను నా యింటికీ, దేశానికీ కూడా కాకుండాపోయినట్టయింది. దేశంకోసం ముష్టెత్తుతూ ప్రాణాలు వదిలినా దేశసేవ అవునేమోగాని, దొంగతనం ఆరాధన ఎన్నటికీ కాదు.

నేను మా పడకగదిగుండా బయటి వరండామీదికి వెళ్ళి తెల్లవార్లూ అక్కడే వుండిపోయాను. తెల్లవారినాక నేను కనిపించగానే మా తోడికోడలు, "విన్నావా, చిన్నరాణీ ? మీ దొంగల ముఠావాళ్ళు ఖజానా దోస్తామని ఆకాశరామన్న ఉత్తరం రాశారు. వాళ్ళను కాస్త నిరోధించు, తల్లీ. మమ్మల్నీ, ఈ యింటినీ దొంగతనంనుంచి కాపాడావంటే నీ వందేమాతరంకు మొక్కుబళ్లు చెల్లించుకుంటాం !" అన్నది.

నేను నా గదికి వెళ్ళాను. ఈ డబ్బు సందీపుడికి అందించేస్తే: దాని భారం నన్ను ఊబిలోకి ఈడ్చేస్తున్నది. కొద్దిసేపటికే, సందీపుడు నా కోసం వచ్చినట్టు వార్త వచ్చింది. నేను ముందుగదికి వెళ్ళేసరికి సందీపుడూ, అమూల్యుడూ అక్కడ కనిపించారు.

"డబ్బేది, రాణీ ?" అన్నాడు సందీపుడు. అతని దాష్టికం చూస్తే డబ్బు అతని ముఖాన విసిరికొట్టా లనిపించింది. వణుకుతున్న చేతులతో కాగితం పొట్లాలు కొంగునుంచి విప్పి అతని ముందు పెట్టాను. అవి వెండి అనుకున్నాడు కాబోలు, సందీపుడి ముఖం ఆగ్రహంతో నల్లగా కమిలింది.

"అంతేనా ?" అన్నాడు అమూల్యుడు దీనంగా. నాకు ఏడవాలనిపించింది. సందీపుడా పొట్లాలను తాకలేదు, మాట్లాడలేదు. అమూల్యుడే తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో, "చాలు ! ఎక్కువ" అంటూ ఒక పొట్లంకాగితం చించాడు. సవర్లు జిగేల్న మెరిశాయి.! వాటితోబాటు సందీపుడి ముఖంకూడా మెరిసింది. అతనా వుద్రేకం అణచుకోలేక, చివాల్న లేచి, నాకేసి వచ్చాడు. అమూల్యుడి ముఖం పాలిపోవటం గమనించాను. ఒక్క తోపుతో సందీపుణ్ణి తోసేసరికి అతను వెనక్కు పడిపోయాడు. అతని తల బల్లమీది పాలరాయి కొనకు కొట్టుకున్నది. అతను కొంతసేపు నేలపైన కదలకుండా ఉండిపోయాడు.

కొంతసేపటికి సందీపుడు లేచి, ఏమీ జరగనట్టుగా సవర్లను తన చేతిరుమాలులోకి తీసుకుని మూటగట్టుకుంటూ, "ఆరువేలు," అన్నాడు.

"మనకు ఆరువే లెందుకు, సందీప్‌బాబూ? మన అవసరం మూడువేల అయిదొందలేగా ?" అన్నాడు అమూల్యుడు,

"మన పనంతా ఈ ఒక్కచోటే అయిపోతుందా ? దొరికినంత పోగుచెయ్యాలి."

"ముందు ముందు మన ఖర్చులకు నేను సంపాదిస్తాను, సందీప్‌బాబూ. ఎక్కువగా ఉన్న రెండువేల అయిదొందలూ మహారాణీకిచ్చెయ్యి," అన్నాడు అమూల్యుడు. సందీపుడు నాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"నేను దాన్ని మరి తాకను; మీ యిష్టం వచ్చినట్టు చేసుకోండి," అన్నాను. సందీపుడు నన్ను వేధించే పశ్చాత్తాపానికి విరుగుడు వేశాడు ...

నా భర్త భోజనానికి కూర్చునిఉండగా నేను ఆయన కెదురుగా కాకుండా కొంచెం పెడగా కూర్చుని ఉన్నాను. మా తోడికోలుడ

వచ్చి, "ఏంమరిదీ? నాకిచ్చిన డబ్బు కలకత్తా బాంకుకు పంపేశావా?" అని అడిగింది. ఆయన ఇంకా పంపలేదంటే, అంత అజాగ్రత్త కూడదన్నది.

"నా గదిలో ఇనప్పెట్టెలో సొమ్ము భద్రంగానే ఉంది," అన్నాడు నా భర్త.

"దొంగలు అక్కడికి రాలేరనేమిటి?" అన్నదావిడ.

నా తల గిర్రున తిరిగిపోతున్నది. ఆ డబ్బు అక్కడ ఎలాగైనా పెట్టెయ్యాలి. కాని ఎలా? నేను మొండిధైర్యంతో, "పెద్దరాణి అనుమానాలు కేవలమూ నాపైనేలా గుంది," అన్నాను.

ఆవిడ కొంటెగా, "అది నిజమే చెల్లెమ్మా," అన్నది.

"నేనంటే అంత భయమైతే నాకున్నదంతా నీవద్ద కుదువ ఉంచుతాను!" అన్నాను.

ఆమె నవ్వుతూ, "కొన్ని దొంగతనాలకు పరిహారం ఉండదని తెలీదులా గుంది," అన్నది నా భర్తతో. ఆయన ఏమీ అనలేదు.

తరవాత నేను, ముప్పై నలభై వేలు చేసే ఆభరణాలుగల పెట్టెను ఆమెవద్దకు తీసుకుపోయి ఉంచమన్నాను. "నా నగలే కాపలా కాయలేక చస్తుంటే, నీవాటినికూడా ఎక్కడ కాయను? ఇంకా నయం!" అన్నదామె.

నా నగలపెట్టె తీసుకుని ముందుగదికి వెళ్ళి, అమూల్యుడికోసం కబురు చేశాను. అమూల్యుడి వెంట సందీపుడుకూడా వచ్చాడు. అమూల్యుడితో రహస్యంగా మాట్లాడగోరుతున్నానని సందీపుడితో అన్నాను.

"మమ్మల్ని వేరు చెయ్య జూస్తున్నావా? సరే ఏంచేస్తాం? అమూల్యుడితో రహస్యంగా మాట్లాడినతరవాత నాతోకూడా రహస్యంగా మాట్లాడి, నాకు లోకువరాకుండా చెయ్యి," అంటూ సందీపుడు గదినుంచి వెళ్ళిపోయాడు.

నేను నా నగలపెట్టె అమూల్యుడికి చూపి, "దీన్ని అమ్మిగాని, తాకట్టు పెట్టిగాని అర్జంటుగా ఆరువేల రూపాయలు పట్టుకురావాలి," అన్నాను.

"ఈ నగలను ఉండనీ, రాణీ అక్కా – నీకు ఆరువేలు నేను తెచ్చి ఇస్తే సరిగదా!'' అన్నాడు అమూల్యుడు.

''పిచ్చిపిచ్చి ఆలోచనలు చెయ్యక, నేను చెప్పినపని చేసి, ఎల్లుండిలోపల ఆరువేలు పట్రా,' అన్నాను.

అమూల్యుడు పెట్టెలోనుంచి ఒక రత్నహారం ఎత్తి, వెలుతురుకు పెట్టిచూసి, దిగులుగా పెట్టెలో పెట్టేసి, "నీకు తెలుసా, రాణీ అక్కా? నేనా ఆరువేలగురించీ సందీప్‌బాబుతో పోట్లాడాను. నాకెంత సిగ్గయిందో చెప్పలేను. దేశంకోసం ఎగ్గుసిగ్గులు వదలాలన్నాడు. 'దేశంకోసం హత్యలైనా చేస్తానుగాని, నీ డబ్బు తీసుకోలేను,' అన్నాడు. ఆ తరవాత వాడు ఉత్సాహంతో సందీపుడి బోధలన్నీ ఏకరువు పెట్టసాగాడు.


అందరికీ దీపావళి శుభాకాంక్షలు !

★ ఆంధ్ర రాజధానిలో

★ ఆంధ్ర ప్రజల ఆదరాభిమానములతో

ప్రఖ్యాతి గాంచిన

# రవీంద్ర హోటల్

( బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ )

ఆబిడ్ రోడ్ :: హైదరాబాద్

రుచికరమైన మాంసాహార, శాకాహార భోజనము - విశ్రాంతికి పరిశుభ్రమైన

గాలివచ్చు గదులు - అన్ని ఆఫీసులకు, వ్యాపారసంస్థలకు

అతిదగ్గర - మర్యాద మన్ననలకు ప్రసిద్ధి గాంచిన

మీ రవీంద్రహోటల్

ఫోన్ : 42626

— PIONEER

మేము మాట్లాడుతుండగా సందీపుడు తొంగిచూశాడు. ఇవాళ అతనితో మాట్లాడటానికి నాకు వ్యవధి ఉండదనిచెప్పి అతన్ని పంపేశాను. సందీపుడు చికాకుగా వెళ్ళిపోయాడు.

"జాగ్రత్త. ఈ నగలసంగతి సందీపుడికి తెలియనివ్వకు. నామీద ఒట్టే. ఈ రాత్రి బండికే బయలుదేరు," అని అమూల్యుడితో చెప్పి, వాణ్ని బయటి వరండాలోకి సాగనంపాను. అమూల్యుడికోసం కాబోలు సందీపుడు బయట వేచి ఉన్నాడు. అమూల్యుడు వెళ్ళిపోయే అవకాశం ఇవ్వడానికి నేను సందీపుణ్ని మాటల్లో పెట్టి, "మీరు నాతో ఏమిటి మాట్లాడా లన్నారు సందీప్ బాబూ?" అన్నాను.

"ప్రత్యేకించి ఏమీలేదు. చిల్లరకబుర్లు. కాని నాకు తీరికలేదు గనక—"

"కొద్దిసేపు కావలిస్తే మాట్లాడతాను."

ఈ లోపుగా అమూల్యుడు వెళ్ళిపోయాడు.

"అమూల్యుడిచేతిలో ఆ పెట్టె ఏమిటి?" అని సందీపుడు అడిగాడు.

"అది చెప్పేమాటుంటే మీ ఎదటే దాన్ని ఇచ్చిఉందునుగా?"

"అమూల్యుడు నే నడిగితే చెప్పడనా?"

"చెప్పడు."

సందీపుడు ఆగ్రహంతో రుసరుస లాడుతూ, తాను కోరితే అమూల్యుడు ప్రాణాలైనా ఇస్తాడనీ, వాడిపైన తనకున్న ప్రభావం కన్న నాది హెచ్చుకావడం ఎంతమాత్రమూ వీల్లేదనీ అన్నాడు.

తన బలంకకన్న నాది హెచ్చని గ్రహించడంవల్లనే అతనికి ఆగ్రహం కలిగింది.

"అది నీ నగలపెట్టె. జ్ఞాపకం ఉంచుకో; వాటిని అదివరకే నువు ఉద్యమానికి ముడుపు కట్టి ఉన్నావు," అన్నా డతను.

నా భర్త ఇనప్పెట్టెనుంచి డబ్బు దొంగిలించి సందీపుడిచేతిలో ఎప్పుడైతే పెట్టానో, అప్పుడే అతనిలో వీరపురుషలక్షణం నా దృష్టిలో పోయింది. అతనిలో నా కిప్పుడు చౌకబారు పేచీకోరు తనమే కనిపించింది.

## నిఖిలుడు చెప్పిన కథ

సందీపుడూ, హరీకుందుజమీదారూ ఏకమయారట. దుర్గాపూజ ఖారీఎత్తున జరపనున్నారట. సందీపుణ్ణి నేను వెళ్ళిపొమ్మనేశాను. అతనూ, విమలాకూడా నన్ను అపార్థం చేసుకోవచ్చు. నేను భయపడరాదు.

మా జమీందారీలో ఉండే ముసల్మానులు దాదాపు గోవధ మాను కున్నారు. ఇప్పుడు ఢాకానుంచి ముసల్మాను ప్రబోధకులు వచ్చి అక్కడక్కడా గోవధలు సాగిస్తున్నారు, ఇది చాలా క్లిష్ట సమస్య. నేను గోవధ నిషేధించానో, మతోన్మాదం పెచ్చరిల్లి, ఇప్పు డథ్యం


రఘూన్స్
## గరల్స్ ట్యుటోరియల్ కాలేజి
కొరిటెపాడురోడ్డు, గుంటూరు - 2
**(HOSTELS ATTACHED)**
జూనియర్ మెట్రిక్, మెట్రిక్ (ఇంగ్లీషు & తెలుగు మీడియమ్స్) S. S. L. C., P. U. C., B. A., & B. Sc., తరగతులకు అన్ని సబ్జక్టులందు ఉత్తమ శిక్షణ యివ్వబడును.

బాలికలకు స్త్రీలచే నడుపబడు ఏకైక సంస్థ

| 1965 | 1966 |
|---|---|
| మెట్రిక్ రిజల్ట్సు 90% | మార్చి మెట్రిక్ రిజల్ట్సు 95% |
| ఇందు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు 50% | P. U. C. రిజల్ట్సు 100% |
| ఇంతేగాక, G. K. సూర్యావతి యను విద్యార్థిని (Regd. No. 2893) యూనివర్శిటి ప్రథమస్థానా న్నలంకరించింది. | (1st Class 60%) |
| | B. A. & B.Sc. రిజల్ట్సు—100% |

నిశ్చయ విజయసాధని

చక్కని హాస్టల్ వసతులతో బాలురకు ప్రత్యేక శాఖ గలదు

వివరములకు
T. SAROJINI DEVI, B. A., B. ED.
*PRINCIPAL*

GEMINI

తర్కం చెబుతున్న ముసల్మానులు కూడా మతంపేరిట గోవధ సాగిస్తారు.

నేను హిందువులను కొందరిని పిలిచి వారితో మాట్లాడాను. ఎవరి విశ్వాసాలకు వారు అంటిపెట్టుకోవటం మంచిది. శాక్తేయులు బలులిస్తున్నారు. ఏమీ చెయ్యటానికిలేదు. ముసల్మానుల విషయమైనా అంతే. అలజడి సాగించవద్దు. ఆవులలాగే గేదెలుకూడా పాలిస్తున్నాయి. వ్యవసాయపుపనులు చేస్తున్నాయి. కాని దున్నలమెడలు నరికి, వాటి తలలను భుజాల కెత్తుకుని మనవాళ్ళు మతంపేరిట నృత్యాలు చేస్తూనే ఉన్నారు. ముసల్మానులతో ఏమొహం పెట్టుకుని తగాదా పడతాం?...

మా చాకువా ఖజానాలో దొంగతనం. 7,500 రూపాయలు కట్టలలో కట్టి ఉంచే, అందులో ఆరువేలు మాత్రమే తస్కరించి, మిగతావి అక్కడే విరజిమ్మిపోయారు. కాపలావాడు కాసిమ్‌కు కొద్దిగా గాయం తగిలిందిట. వాటిని దొంగ లెందుకు తీసుకుపోయారుకానో తెలీదు. ఇంక పోలీసులు వచ్చిపడతారు.

మా వదినెగారు చాలా కంగారుపడింది. నాకందరూ శత్రువులెందు కవుతున్నారని అడిగింది. నేను కలకత్తాకు వెళ్ళిపోవడం క్షేమ మన్నది. ఆవిడ భయం చూడలేక, ఇనప్పెట్టెనుంచి ఆవిడ డబ్బు తీద్దా మనుకుని పడకగదికి ఆమెను వెంటబెట్టుకుని వెళ్ళాను. గదితలుపు గడియపెట్టిఉన్నది. లోపలనుంచి విమల బట్టలు కట్టుకుంటున్నానని చెప్పింది,

"ఇంత పెందలాడే డ్రెస్సు చేసుకుంటున్నదా?... దొంగల రాణీ, దొంగసొమ్ము లెక్కించుకుంటున్నావా?" అని మా వదిన ఛలోక్తిగా కేకపెట్టింది.

డబ్బుసంగతి తరవాత చూస్తా నన్నాను.

నాకోసం పోలీసు ఇన్‌స్పెక్టరు వేచిఉన్నాడు. కాపలావాడు కాసిమ్‌పైనే తనకు అనుమాన మన్నాడు. వాడికి తగిలిన గాయం, చాలా చిన్నదనీ, వాడే చేసుకున్నా చేసుకుని ఉండవచ్చుననీ అన్నాడు. కాని కాసిమ్ చాలా నమ్మకమైనవాడు. అదీగాక వాడు డబ్బంతా ఎందుకు కాజెయ్యలేదు? వాణ్ణి జైలుకు పంపటానికి ఒప్పనని చెప్పేశాను. వాణ్ణి లాకప్‌లో ఉంచారు. నేను వాణ్ణి చూడబోయాను. నన్నుచూడగానే ఏడుస్తూ నా కాళ్ళపైనపడి తా నేపాపమూ ఎరగనన్నాడు కాసిమ్. కాని వాడు ఏం జరిగినదీ నమ్మేటట్టుగా చెప్పలేదు; నాలుగైదు వందలమంది పెద్ద తుపాకులతో వచ్చిపడి తనను వివశుణ్ణి చేశారనీ, హరీశకుందుజమీందారే ఈపని చేయించి ఉంటాడనీ అన్నాడు. లేనిపోనివా ళ్ళందరిపేర్లూ ఎత్తవద్దని వాణ్ణి హెచ్చరించాను.

"విమల దృక్పథం మరీ సంకుచితంగా ఉన్నది. ఆమెను


దీపావళికి

పాఠకులకు మా శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు

ఆయుర్వేదౌషధములనే ప్రోత్సహింపుడు

కేటలాగు, వైద్యసలహా ఉచితము

**శాస్త్రీయౌషధ నిర్మాతలు:**

# శ్రీ భుజంగరాయ వైద్యశాల

ప్రొప్రయిటర్సు: 'భిషక్‌శిరోమణి' పొన్నాడ పేరయ్యా అండ్ సన్సు

హెడ్డాఫీసు: తాళ్ళరేవు, తూర్పుగోదావరి జిల్లా.

కలకత్తా తీసుకుపోయి, విశాలజీవితం చూపించు," అని మా గురువుగారు సలహా ఇచ్చాడు నాకు.

నేనూ ఆ ఆలోచనలోనే ఉన్నాను.

ఆ రోజల్లా విచారణ గొడవతోనే సరిపోయింది. మా వదినగారి డబ్బు కలకత్తాకు పంప నిశ్చయించాను. నేను బాగా బడలిపోయి గదికి వెళ్ళి పడుకున్నాను.

అర్ధరాత్రివేళ నిద్ర లేచాను. గది అంతా చీకటిగా వుంది. ఎక్కడో ఎవరో ఏడుస్తున్న ధ్వని వినిపించింది. నేను గదిబయటికి వచ్చాను. బాల్కనీలో విమల బోర్లా పడుకునివుంది. ఆ నిశిరాత్రి వేళ ఒక్క హృదయం పొందే సంక్షోభానికి ఏం పేరు పెడతాం? దాన్ని ఎలా వర్ణించడం? ఆమె మంచిచెడ్డలను నిర్ణయించడానికి నే నెవణ్ణి?

నేను వెళ్ళి ఆమె పక్కన చతికిలబడి, ఆమె తలపైన చెయ్యి వేశాను. ఒక్క క్షణంపాటు నా స్పర్శ కామె కొయ్యబారిపోయినట్టయింది. కాని మరుక్షణం అశ్రువులు వెల్లువగా ప్రవహించాయి. ఆమె నా కాళ్లు తడివి పట్టుకుని, వాటిని తన గుండెలకు బలంగా అదుముకున్నది. ఆమె గుండె పగిలిపోయేలా కనిపించింది.

## విమల చెప్పిన కథ

అమూల్యుడు ఈ ఉదయం కలకత్తానుంచి తిరిగిరావాలి. వాడు రాగానే నాకు చెప్పమని నౌకర్లతో చెప్పివుంచాను. తొమ్మిది గంటలు కొట్టింది. అమూల్యుడు చిక్కులో పడివుంటాడా? అంత పసివాణ్ణి నే నేమని పంపాను!

వరండాలోకి వెళితే మా తోడికోడలు ఆకులకు సున్నం రాస్తూ కనిపించింది. నేను వెళ్ళి ఆమెకు ప్రణామం చేసి, పాదధూళి తీసుకున్నాను.

"ఇదేమిటి, చిన్నరాణీ?" అన్న దామె.

"ఇవాళ నా పుట్టినరోజు."

"చెప్పలేదేం మరి? భోజనానికి రా,''

నేను ముందుగదికి వెళ్ళేసరికి సందీపుడు వచ్చివున్నాడు. అతని ముఖం చూడగానే రోత కలిగింది. అతన్ని గదిలోనుంచి అవతలికి పొమ్మన్నాను, మరోసారి రమ్మన్నాను.

'అమూల్యుడికోసం చూస్తున్నావుకదూ?' అంటూ అతను నా నగలపెట్టెను పైబట్టకిందినుంచి తీసి బల్లమీద పెట్టాడు.

"అమూల్యుడు కలకత్తా వెళ్ళనేలేదా?" అన్నాను కంగారుగా.

"లేదు. సంతోషమేనా, రాణీ? దేవికి అర్పించిన నివేదన తిరిగి పుచ్చుకుంటావా?"

నా కవంటే లక్ష్యం లేదని చూపడానికి, "మీకు వాటిమీద వ్యామోహంగా వుంటే మీరే తీసుకోండి," అన్నాను.

"బెంగాలులో వుండే ధన మంతటిమీదా నాకు వ్యామోహం వుంది. అయితే ఇవి నావే నన్నమాట!"


శుభవార్త!



శరీరంలో ఏ భాగంలోనైనా, పేరేదైనా, ఎన్నాళ్ళనుండీ బాధపడుతున్నా మొండి వ్యాధులకు డాక్టర్ రావు కు తెలుపండి.

(ప్రతినెల-అన్నిజిల్లా ముఖ్యకేంద్రాలలో(దక్షిణభారతదేశంలో) మా నాడీప్రవీణుల సలహాలు మీదగ్గరలోనున్న కేంద్రం,తేదీ వ్రాసి తెలుసుకోండి.

రామ్స్ ప్రొడక్ట్సు 6-2-961- ఖైరతాబాద్ హైదరాబాద్.

సొగసైన కురులు



రీటా

ఏపుగా, అందంగా జుట్టును పెంచుతుంది

ఒకరి శిరోజ సౌందర్యంచూచి మరొకరు ఇక ఎంతమాత్రం అసూయపడవలసిన అవసరం లేదు. రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.

రీటో కంపెనీ,
మద్రాసు 1




R-20 TG


సందీపుడు నగలపెట్టెను తన పైబట్ట కింద పెట్టేసుకుంటుండగా అమూల్యుడు పరిగెత్తుకుంటూ వచ్చి, నాకేసికూడా చూడకుండా, "నా పెద్టె!" అంటూ సందీపుణ్ణి సమీపించి, "నా ట్రంకుపెట్టెలోనుంచి నగలపెట్టె తీశావా?" అని అడిగాడు.

"నీ నగల పెట్టా?"

"నా ట్రంకు పెట్టె."

"నీ–నా విచక్షణ చాలాదాకా వచ్చిందే," అంటూ సందీపుడు నవ్వాడు.

అమూల్యుడు విచారంగా కూలబడి, "ఆనగలు నీకు తిరిగి ఇచ్చెయ్యాలని ఎంతో అనుకున్నాను, రాణీ అక్కా!" అన్నాడు.

"అవి నావి. దాన దమన విక్రయ హక్కులతో వాటిని నాకిచ్చేసింది," అన్నాడు సందీపుడు.

"వొద్దొద్దొద్దు, వాటిని ఎవరికీ ఇవ్వకు," అన్నాడు అమూల్యుడు వెర్రిగా.

"వాటికోసం తపించేవాళ్ళను తీసుకోనీ," అన్నాను.

అమూల్యుడు సందీపుణ్ణి తినేసేటట్లు చూస్తూ, "చూడు, సందీప్ బాబూ, ఆ నగలపెట్టెను తీసుకోవటానికి సాహసించావంటే..." అన్నాడు.

సందీపుడు అమూల్యుడితో, "నేను నిన్ను చూశా భయపడతాను? అని నా కేసి తిరిగి, "చూడు, రాణీ! నేనివాళ నీ నగలు తీసుకోవటానికి రాలేదు; ఇవ్వటానికి వచ్చాను. నేనివ్వవలసినది మరొకరి చేతిమీదుగా నీకు చేరటం నాకిష్టంలేదు. ఇది నీకు నా కానుక. ...ఇదిగో, అమూల్యా! నీ పెట్టెబేడా మీ యింటికి పంపేశాను. ఇకనుంచీ నీ వస్తువు లేవీ నా గదిలో ఉండడానికి వీల్లేదు," అన్నాడు, లేచి వెళ్ళిపోతూ.

నేను అమూల్యుడితో, "నిన్నా పనిమీద పంపినందుకు నేను ఎంతో విచారించాను. నీవు వెంటనే ఇంటికి, మీ అమ్మదగ్గిరికి వెళ్ళిపో, తమ్ముడూ," అన్నాను.

"నేను నీకు ఆరువేలూ తెచ్చానక్కా! బంగారంగా మార్చటానికి లేకపోయింది. నోట్లుగా తెచ్చాను."

"ఎక్కడినుంచి తెచ్చావు? నా మీద ఒట్టేసి చెప్పు," అన్నాను.

"అలా అయితే చెప్పను. నేను తప్పుచేశానని నువ్వనగలవు."

నా రక్తనాళాలు ముడుచుకుపోయాయి.

"వెళ్ళు అమూల్యా. ఎక్కడనుంచి తెచ్చావో అక్కడే ఉంచిరా," అన్నాను,

"అది చాలా కష్టం."

"కష్టంకాదు, నాయనా. సందీపుడుకూడా నిన్ను పాడుచెయ్యనంతగా నేను చేశాను."

"సందీపుడా? అత నెలాటివాడో నాకు తెలిసింది నీ మూలానే అక్కా. నీదగ్గర తీసుకున్న సవర్ల లో ఒక్కటికూడా ఖర్చు చెయ్య

లేదు తెలుసా? వాటిని తనగదిలో పోగుపోసి చూసుకుంటూ లొట్టలు వేశాడు. మీ ఎస్టేటు మేనేజరుదగ్గిర మాకు నష్టం కలిగించే ఉత్తరా లుండిపోయాయి. వాడికి లంచం పెట్టటానికే నీ బంగారం. కాని సందీపుడా ఉత్తరాలను సంపాదించటానికి మరోమార్గం ఆలోచించాడు. వివరాలు అడక్కు; బంగారం మాత్రం సందీపుడిదగ్గిరే ఉండిపోయింది. నువు సగ అమ్మమున్నప్పుడుకూడా సందీపుడి దగ్గిరికే వెళ్ళాను. కాని బంగారం ఎక్కడో దాచేసి చెప్పలేదు. పెట్టెలో వెతుక్కోమని తాళపుచెవు లిచ్చాడు. పెట్టెల్లో బంగారం లేదు ఏం చెయ్యాలి? నేను మరోవిధంగా డబ్బుసాధించి, దానికి బంగారం ఇవ్వమన్నాను. ఇస్తా నుండమని చెప్పి, తన పడకగది లోకి పోయి, నా ట్రంకుపెట్టెనుంచి నగలపెట్టె తీసుకుని, వెనక దారిగా వచ్చేశాడు. అది నీకు తన కానుకట! నే నా మనిషిని ఎన్నటికీ క్షమించను," అన్నాడు అమూల్యుడు.

అమూల్యుడు వెళ్ళిపోయాక నాగుండె కుంగిపోయింది. ఇంతలో సందీపుడు మళ్ళీ వచ్చాడు. అతను మళ్ళీ తన ఉపన్యాసధోరణి ప్రారంభించాడు.

"సందీప్‌బాబూ. ఈ విధంగా అంతులేకుండా ఎలా మాట్లాడగలవు? ఈ ఉపన్యాసాలు కంఠస్థం చేస్తావా? కొందరు గొప్ప వక్తలు వివిధవిషయాలమీద చేయదగిన ప్రసంగాలు పుస్తకంలో రాసిఉంచుకుంటారని విన్నాను," అన్నాను.

సందీపుడి ముఖం జేవురించింది. ఆతనికి ఆత్మనిగ్రహం బొత్తిగా పోయింది. "నన్నింత అవమానిస్తావా? నీ బతుకంతా నాకు క్షుణ్ణంగా తెలుసునే. ఏం ..." అతనికి మాటరాలేదు.

ఇంతలో నా భర్త అక్కడికి వచ్చాడు.

"సందీప్, నేను రేపు కలకత్తా పోతున్నాను. నువుకూడా నా వెంట వస్తున్నావు," అన్నా డాయన.

"ఎందుకో? నీ పరిచారకుణ్ణా?"

"పోనీ నువే కలకత్తా పోతున్నా వనుకో. నేను నీ వెంట వస్తున్నా ననుకో."

"నా కక్కడేం పని లేదే?"

"మరీ మంచిది; ఇక్కడ మరీ పని జాస్తీగా ఉంది."

"నే నిక్కడనుంచి కదలను."

"అయితే నేను కదిలిస్తాను."

"బలాత్కారంగానా?"

"బలాత్కారంగానే."

"అయితే నేనే పోతాను. కలకత్తా, నీ ఎస్టేటూమాత్రమే కాదు, ప్రపంచంలో చాలా చోట్లున్నాయి."

"కాని నీతీరు చూస్తే ప్రపంచంలో నా ఎస్టేటుతప్ప మరేచోటూ లేనట్టు కనబడిందిలే."

"ఒక్కోసారి చాలా కొద్దిజాగాలోనే విశ్వం దర్శన మిస్తుంది.


స్థాపితం : 1957    ఫోన్స్ : 917, 1192, 1545.

కష్టమే ఫలిస్తుంది    సత్యమే జయిస్తుంది

ఈ సూత్రాలు మా నేత్రాలు
విజయానికి సోపానాలు

రవి ట్యుటోరియల్ కాలేజి
రవి బాలికా కళాశాల
రవి ఇంగ్లీషు మీడియం కాలేజి

2, 3, 4 లైనులు — బ్రాడీపేట - గుంటూరు - 2.

1500 మంది విద్యార్థులు, 50 మంది అధ్యాపకులు, 6 హాస్టల్సు, 3 లేబొరేటరీలు గల్గిన మీ అభిమాన సంస్థ అందించే శుభాకాంక్ష లందుకోండి.

ప్రిన్సిపాల్ :
సి. వి. యన్. ధన్, M. A.

GEMINI

నీ గదిలో నాకు విశ్వం గోచరించింది. అందుకే ఇక్కడ పాతుకుపోయాను,'' అంటూ సందీపుడు నాకేసి తిరిగి మరొక ఉపన్యాసం ఇచ్చాడు. అది అద్వితీయమైన ఆరాధనతో కూడిన ఉపన్యాసం. నేను దానికి చలించాను. అతనిలో కొన్ని లోతులు లేకపోలేదు.

"...నీ యొక్క విశాలమూర్తిని మరింత విస్తృతమైన ఆలయంలో ఆరాధించడానికి వెళ్ళిపోతున్నాను. ఇక్కడ నాకు నీ అనుగ్రహమే లభించింది, అక్కడ నీ వరం సంప్రాప్తమవుతుంది."

అని అతను ఉపన్యాసం ముగించాడు.

నేను నా నగలపెట్టెను పైకెత్తి దాన్ని తీసుకుపోయి దేవికి అర్పించమన్నాను. నా భర్త మౌనంగా అలాగే నిలబడ్డాడు. సందీపుడు వెళ్ళిపోయాడు...

మా ఖజానా పైన అయిదారు వందలమంది వచ్చిపడి ఆరువేలు దోచుకుపోయారని విని నిర్ఘాంతపోయాను. నాకోసం జరిగిన దొంగతనమే అది. అమూల్యుడు దొంగిలించినది తీరా మా డబ్బే. దాన్ని వాడు నా భర్తకు అందజేసినట్టయితే, చెప్పవలసిందేదో నేనే చెప్పుకుంటాను. నేను చప్పున డ్రెసింగ్ రూముకు వెళ్ళి, తలుపు బిగించి, నా భర్త జేబులో వుండే తాళపుచెవుల గుత్తినుంచి ఇనప్పెట్టె తాళం తీసి నా బొడ్డులో దాచేశాను.

ఇంతలో తలుపు తట్టారు. బట్టలు మార్చుకుంటున్నా నన్నాను. మా తోడికోడలు నన్ను దొంగలరాణీ అని వేళాకోళంగా పిలిచింది. వాళ్ళు వెళ్ళిపోయాక వచ్చినట్టు దుస్తులు మార్చుకున్నాను.

అమూల్యుడికోసం మనిషిని పంపుదా మనుకుంటూండగా, కొంచెం ఆలస్యంగా వస్తానని వాడే చీటీ పంపాడు. వాడా డబ్బు ఏం చేస్తాడో. దీని కంతా మూలకారణం నేనేనని ఇప్పుడే చెప్పేస్తే బాగుండును.

కాని చెప్పలేకపోయాను.

నా భర్త భోజనం చేస్తూండగా పోలీసుఅధికారి సంచూను తెచ్చినట్టు కబురు వచ్చింది. ఆయన భోజనం పూర్తిచెయ్యకుండానే లేచి వెళ్ళిపోయాడు.

ఇంక నా బతుకు కొద్దిగంటలలో తేలబోతున్నది. ఎల్లుండిలోపల పాపం బద్దలవుతుంది; అపవాదూ, అపహాస్యాలూ, ఏడుపులూ, పెడబొబ్బలూ, ప్రశ్నలూ, సంజాయిషీలూ — అన్నీ అయిపోతాయి.

నాకు అమూల్యుణ్ణి గురించే విచారం. వాడు అపాయం ఆలోచించకుండా ప్రమాదంలోకి వురికాడు! నేను వాడికి చెయ్యెత్తి దణ్ణం పెట్టాలి. వాడు నాకు చిన్నదేవుడు. వచ్చే జన్మలోనైనా వాడు నా కొడుకుగా పుడితే ఎంతబాగుండును!...

వచ్చే పోలీసులూ, వెళ్ళే పోలీసులూ, అటూ ఇటూ తిరిగే నౌకర్లూ—ఇల్లంతా అడావుడిగా వుంది. దాసీది తన నగలు తెచ్చి


# K. ORR & COMPANY

Indenting Agents, Importers & Paper Merchants
16, Stringers Street
MADRAS-1

*From Stock :*

Paper, Printing Inks,
Printer's Sundries
Adding Machine Rolls,
Teleprinter Paper Rolls &
Allied Products
Garage Equipments
(Polish Make)

*Indents :*

Paper, Process Zinc &
Copper Sheets
Printing Machines
Hardware, Match Chemicals
Acrylic Plastic Sheets,
Iron & Steel, "KG" Brand Zip
Fasteners

**Phone : 23019 & 23526**

**Grams : "PRESUNDRY"**

నన్ను దాచమన్నది. ఇంట్లో దొంగలు పడతారని పెద్దరాణి చేసే గోలే దీనికి కారణం. పాలమనిషి తన చీరెలపెట్టె తెచ్చి నా గదిలో పెట్టుకుంది.

రేపు ఇనప్పెట్టె తెరిచినప్పు డుంటుంది కొలుపు!

అమూల్యుడికోసం నేను ముళ్ళమీద ఉన్నాను. చీకటి పడేవేళ వాడికోసం మనిషిని పంపితే ఆ మనిషి వచ్చి, అమూల్యుడు రోజల్లా ఇంటికి రాలేదని చెప్పాడు.

రాత్రి విందు ముగిసేసరికి చాలా పొద్దుపోయింది. నా పుట్టిన రోజు పండగను నా భర్త పాదస్పర్శతో ముగిద్దామని పడక గదికి వెళ్ళాను. ఆయన అలిసిపోయి గాఢనిద్రలో ఉన్నాడు దోమ తెర మెల్లిగా పైకెత్తి, నా శిరస్సు ఆయన పాదాలకు తాకించాను. ఆయన పాదాలు నా తలను నెట్టేశాయి, కాని ఆయన మేలుకోలేదు.

నేను వెళ్ళి పడమటి వరండాలో కూర్చుని అస్తమించబోయే చంద్రుడికేసి చూశాను. నా పరిస్థితి తలుచుకున్నకొద్దీ దుఃఖం పొంగి పొర్లివచ్చింది. వరండాలో బోర్లా పడుకుని వెక్కి-వెక్కి ఏడ్చాను. నా జీవితం ముగిసేలోపున కనుచూపు మేరలో కాసంత దయ, పిసరంత ఆశ్రయం కోరుతూ దేవుణ్ణి ప్రార్థించాను.

అడుగుల చప్పుడయింది. దేవతలు ప్రార్థనలు ఆలకించరని ఎవరనగలరు? నా దేవుడు వచ్చి తన కాళ్ళను నా తలకు తాకించి. అలిసిపోయే నా హృదయంపైన పాదం ఉంచినట్టయితే, తృప్తిగా ఈ తనువు చాలిస్తాను.

ఆయన నా తలదగ్గిర కూర్చుని స్పృశించేసరికి నా దుఃఖం కట్టలు తెంచుకున్నది. ఆయన నా తల నిమిరి నన్నాశీర్వదించాడు. రేపు నాకు ఎంత ఘోరావమానం జరిగినా నేను లక్ష్యపెట్టను.

## నిఖిలుడు చెప్పిన కథ

ఇవాళ కలకత్తా వెళ్ళిపోతున్నాం. మా ప్రేమబంధాలను ఇక్కడే వదిలి వెళుతున్నాం. మాది ఒకేదారి అయినంతకాలమూ వాటితో పేచీ రాలేదు. కాని ఇప్పుడు దారులు చీలాయి.

నేను వెంటపెట్టుకుపోయే సామానంతా చూసి, "ఏమిటి, నువు మళ్ళీ తిరిగి రావా?" అని పెద్దరాణి అడిగింది.

"వస్తూ పోతూ ఉంటాను, గాని అక్కడే పాతుకుపోను," అన్నాను.

"అయితే నేను సర్దుకున్న సామాను లొక్కసారి వచ్చి చూడు," అన్న దామె. ఆవిడ గదినిండా అంతులేని సామాన్లు ప్రయాణానికి సిద్ధం చేసిఉన్నాయి.

"ఇదంతా ఏమిటి, వదినా?" అన్నాను.

"నేను మీవెంట రావటం లేదనా నీ ఉద్దేశం?"

నాకు చాలా సంతోషమయింది. ఆమె తొమ్మిదేళ్ళ పిల్లగా మా యింట అడుగు పెట్టిననాటినుంచీ మా మధ్య ఆత్మీయత ఎంతగానో అల్లుకున్నది. ఆమె కీనాడు ప్రపంచంలో నేను తప్ప ఆప్తులెవరూ లేరు.



"మనం ఎప్పుడు బయల్దేరుతున్నాం?" అని ఆమె అడిగింది.

"బండి రాత్రి పదకొండున్నరకు. బోలెడంత వ్యవధి ఉన్నది," అన్నాను.

నా గదికి వెళుతుండగా క్షేమ వచ్చి, పోలీసుఅధికారి ఎవరినో ఖైదీని తెచ్చాడని నాతో అన్నది. పోలీసుఅధికారితోబాటు ఆ రెండో మనిషికూడా ఫలహారం పంపించమని మా వదినెను కేకపెట్టాను.

నేను స్నానం చేసి బయటికి వచ్చేసరికి విమల నాకోసం వేచి ఉన్నట్టు కనబడింది. విషయ మేమిటంటే, పని చూసివచ్చినాక తా నేదో మాట్లాడతా నన్నది.

నేను నా గదికి వెళ్ళేసరికి పోలీసుఅధికారితోబాటు అమూల్యుడు ఫలహారం చేస్తూ కనిపించాడు. వాడు నన్ను చూసి, తినగా మిగిలిన భక్ష్యాలు చేతిరుమాలులో మూటగట్టుకున్నాడు.

''దొంగ దొరక్కపోగా– దొంగతనం మరింత అయోమయంగా తయారయిందండీ,'' అన్నాడు పోలీసుఅధికారి నవ్వుతూ. అతను ఒకగుడ్డలో మూటగట్టిన కరెన్సీనోట్లు నా కిస్తూ; "మీరు పోగొట్టుకున్న ఆరువేలు,'' అన్నాడు.

''ఎక్కడ దొరికాయి?" అన్నాను.

''అమూల్యుడి చేతిలో. ఎక్కడ దొరికాయంటే చెప్పకుండా ఉన్నాడు. వీటిని తీసుకుని మీ చాక్నాఖజానాదారువద్దకు వెళ్ళి ఇవ్వబోతే ఆయన తీసుకోవటానికి భయపడ్డాట. చెప్పకపోతే నిర్బంధంలో ఉండవలసివస్తుం దన్నాను. అలాఅయితే అబద్ధం చెప్పవలసివస్తుం దన్నాడు అమూల్యుడు.''



"పరువుగలవాడు అమూల్యుడితో ఈ ఘర్షణేమిటి?" అన్నాను.

"నిజమే బాబూ. వాళ్ళ నాన్న నివారణబాబూ నేనూ కలిసి చదువుకున్నాం. కాని ఏంచెయ్యను? దొంగ ఎవరో అమూల్యుడికి తెలుసు. దొంగను దాస్తున్నాడు; ఈలోపల అసలుదొంగ జారిపోతాడు."

పోలీసుఅధికారిని పంపేసి నేను అమూల్యుణ్ణి అడిగాను: "దొంగ ఎవరో నాకు చెప్పావంటే ఎవరికీ శిక్షపడకుండా చూస్తాను."

"నేనే," అన్నాడు అమూల్యుడు.

"అదెలా? వందలకొద్దీ ఆయుధాలతో వచ్చి పడ్డారట ...!"

అమూల్యుడు నాకు చెప్పిన వివరాలు ఆశ్చర్యకరమైనవి. వాడు రెండు జేబులలోనూ రెండు పిస్తోళ్ళుపెట్టుకుని ఖజానాకు వెళ్ళాట్ట. ఒక దానిలో ఖాళీతూటాలూ, రెండోదానిలో గుండుతూటాలూ ఉన్నాయి. వాడు ముఖానికి గంతకట్టుకుని, భోజనం చేస్తున్న ఖజానాదారు ముఖం మీదికి చేతిలాంతరు తిప్పి, ఖాళీతూటా పేల్చాట్ట. ఖజానాదారు మూర్ఛపోయాడు. కొందరు డ్యూటీలో లేని కాపలావాళ్ళు పరిగెత్తుకుంటూ వచ్చి, అమూల్యుడు మరొక ఖాళీతూటా పేల్చేసరికి, పారిపోయారు. ఇంతలో, డ్యూటీలోఉన్న కాసిమ్ బాణాకర్ర తిప్పుకుంటూ వచ్చాడు. ఈసారి అమూల్యుడు కాసిమ్ కాలికి గోలీతూటా గురిచేసి పేల్చాడు. దెబ్బతగిలిన కాసిమ్ పడిపోయాడు. తరవాత అమూల్యుడు మేనేజరుకు స్పృహ తెప్పించి, ఆరువేలు వసూలు చేశాడు.

"ఎందుకిలా చేశావు?" అని అడిగితే దానికంతకూ పెద్ద కారణం ఉందన్నాడు. డబ్బు కాజేసినవాడివి తిరిగి ఎందుకిచ్చావంటే, చిన్నరాణి ఆజ్ఞప్రకారం అంతా జరిగిందన్నాడు.

విమలకోసం కబురు పంపితే, జంకుతూ జంకుతూ వచ్చింది. అమూల్యుడామె పాదాలు స్పృశించి, "నీ ఆజ్ఞ నివ్వర్తించాను, అక్కా. డబ్బు తిరిగి ఇచ్చేశాను," అన్నాడు.

"నన్ను రక్షించావు, తమ్ముడూ," అన్నది విమల.

"ఒక్క అబద్ధం ఆడలేదక్కా! వందేమాతరం మంత్రాన్ని నీ పాదాలదగ్గిర విసర్జించేశాను. నీ ప్రసాదంకూడా ముట్టింది. అంతా తినలేదు, కొంత మూటగట్టుకున్నాను..."

నేనక్కడ ఉండనవసరం లేదనిపించి, బయటికి వచ్చేశాను. ఇవతల గదులలో మా వదినె కనిపించింది.

"నీ డబ్బు తీసి మనవెంట తీసుకుపోదాం," అని ఆమెతో అన్నాను. ఆరువేలూ ఎలా దొరికాయో నేనామెకు చెప్పలేదు.

తాళపుచెవుల గుత్తిలో ఇనప్పెట్టె తాళంచెవి కనిపించలేదు. దాని కోసం తెగ వెతుకుతూంటే మా వదినె, "చిన్నరాణి తీసిఉంటుంది. కంగారుపడకు," అన్నది.

నేను భోజనం చేశాక, విమల రాగానే, ఆవిడే తాళంచెవివిషయం అడిగింది.

"నా దగ్గిర ఉన్నది," అన్నది విమల.

నాకేమో సంకోచం కలిగింది. "తాళంచెవి ఉండనీలే; డబ్బు సాయంకాలం తీస్తాను," అన్నాను.

"నేనదివరకే తీసేశాను," అన్నది విమల. నేను ఉలిక్కిపడ్డాను.

"ఎక్కడ పెట్టావు?" అని వదినె అడిగింది.

"ఖర్చుచేశాను," అన్నది విమల.

"అంత డబ్బూ దేనికిగాను ఖర్చు చేశావు?" అన్నది వదినె. విమల జవాబు చెప్పలేదు.

ఈ ఆరువేలూ విమల తీయటానికీ, ఆ ఆరువేలూ దొంగతనం కావటానికీ ఏదో సంబంధం ఉంటుందని గ్రహించాను. కాని అదేమిటో తెలుసుకోవాలని నాకు తహతహ లేదు.

నేను పడకగదిలో విశ్రాంతి తీసుకుంటూండగా అలికిడి అయింది. లేచివెళ్ళి చూసేసరికి విమల గబగబా వెళ్ళిపోతున్నది. నేనామెను పేరుపెట్టి పిలిస్తే ఆగింది. ఆమెను చెయ్యి పట్టుకుని గదిలోకి తీసుకువచ్చి, ఆమెను నా రొమ్ముకు అదుముకోబోయాను. ఆమె నా చేతులను తోసేసి, కింద మోకరించి నా పాదాలకు తన తల మళ్ళీమళ్ళీ తాకించింది.

## విమల చెప్పిన కథ

నాకిక ఎవరి భయమూ లేదు, దేనిభయమూ లేదు. నేను అగ్నితప్తనయాను. తగలబడేదేదో అది కాలి బూడిద అయిపోయింది.

మిగిలినది నాశనం లేనిది. నా పాపా లన్నిటినీ తన బాధలో ఇముడ్చుకున్న వ్యక్తియొక్క పాదపద్మాలకు నేను అంకిత మైపోయాను.

ఈ రాత్రి కలకత్తాకు పోతున్నాం. మనోవ్యధలో మునిగిపోయి నేను నా వస్తువులు సర్దుకోనేలేదు. ఇక ఆ పని చూడాలి. నా భర్త సామాన్లు సర్దటంలో ఉండటం చూసి, ఆయనను కాస్సేపు విశ్రాంతి తీసుకోమన్నాను. ఆయన నా మాట వినిపించుకోలేదు. ఇంతలో సందీప్‌బాబు వచ్చాడని చెప్పాడు.

"రా, విమలా. సందీపు డేమంటాడో విందాం. వెళ్ళిపోయినవాడు తిరిగి రావటాని కేదో కారణం ఉంటుంది," అంటూ నా భర్త బయలుదేరాడు. ఇద్దరమూ వెళ్ళేసరికి సందీపుడు, "మళ్ళా వీడెందు కొచ్చాడా అనుకుంటున్నారు కాదూ? మారణహోమం తంతు పూర్తి అయితేనేగాని దయ్యం విరగడకాదు," అంటూ ఒక గుడ్డమూట తీసి బల్లపైన పెట్టాడు. అది సవర్ల మూట.

"నిఖిల్, నేను పశ్చాత్తాపంతో కుమిలిపోయి పరివర్తన చెందాననుకోను. కాని"—అంటూ సందీపుడు నాకేసి తిరిగి, "రాణీ, అంతరాత్మ ఎన్నడూ నన్ను వేధించి ఎరుగదు. కాని అందులోకి ఎలాగో ఒక పిసరు జాలి ప్రవేశించి నాకు సరిగా నిద్ర ఉండడం లేదు. ఋణవిముక్తితో తప్ప నాకు విమోచనం కలగదు. ఇదికూడా తీసుకో," అంటూ నా నగలపెట్టుకూడా తీసి బల్లపైన పెట్టాడు.

అతను త్వరత్వరగా వెళ్ళిపోతూండడం చూసి నా భర్త, "సందీప్, ఒక్కమాట," అని పిలిచాడు.

"నేను త్వరగా వెళ్ళాలి, నిఖిల్. ముసల్మానులు నన్ను చాలా విలవైనవాణ్ణిగా ఎంచి, గోరీలో భద్రపరచాలని చూస్తున్నారుట. కాని నాకేమో నాలుగు కాలాలపాటు బతికుండాలని ఉంది. ఇరవై అయిదు నిమిషాలలో ఉత్తరానికి బండి వెళుతున్నది. నన్నడిగితే మీరైనా త్వరలోనే పలాయనం చిత్తగించడం మంచిది; వస్తాను, సెలవు, రాణీ," అంటూ సందీపుడు పరుగుతీశాడు.

నేను కొయ్యలాగా నిలబడిపోయాను. నా భర్త నా చెయ్యి పట్టుకుని, "మనకూడా ఎక్కువ వ్యవధి లేదు," అన్నాడు.

అంతలో చంద్రనాధబాబు వచ్చి, "నిఖిల్, ముసల్మానులు తెగబడ్డారు. వాళ్ళు హరీశకుందు ఖజానా లూటీ చేస్తున్నారు. లూటీ లేమిటి? వాళ్ళ ఇంటి స్త్రీలపైన అత్యాచారాలు చేస్తున్నారు," అన్నాడు.

"నేను వెళ్ళాలి," అన్నాడు నా భర్త.

"మీరు వెళ్ళి ఏం చేస్తారు?" అన్నాను. అయనను వెళ్ళనివ్వవద్దని గురువుగారిని వేడుకున్నాను.

"భయంలేదు, విమలా," అంటూ నా భర్త వెళ్ళిపోయాడు. కిటికీవద్దకు వెళ్ళి చూసేసరికి, ఆయన చేతిలో ఏ ఆయుధమూ లేకుండా గుర్రంమీద దౌడుతీయడం కనిపించింది.



మా తోడికోడలు వచ్చి, "ఎంతపని చేశావు, చిన్నీ? అతన్ని ఎలా వెళ్ళనిచ్చావు?" అన్నది ఆందోళనతో.

ఆమె దివానుకు కబురు చేసి, మహారాజును వెనక్కు తీసుకు రావడానికి వెంటనే మనిషిని పంపండి," అన్నది.

"మే మందరమూ వద్దని ఎంత చెప్పినా వినలేదు రాణీఅమ్మా!" అన్నాడు దివాన్.

"పెద్దరాణి చావుబతుకుల్లో ఉన్నదని కబురు చెయ్యండి," అన్నది మా తోడికోడలు వెర్రిగా.

చీకటి పడుతున్నది. దూరంనుంచి కోలాహలం అలలు అలలుగా వినవస్తున్నది. చీకటి పడుతున్నకొద్దీ ప్రతి మామూలు ధ్వనీ మరేవోలా వినిపిస్తున్నది.

గడియారం పది కొట్టింది. మరి కాస్సేపటికి దూరాన దీపాలు కనిపించాయి. పెద్ద గుంపొకటి మా భవనంకేసి వస్తున్నది.

దివాను గేటువద్దకు పరిగెత్తాడు. అప్పుడే ఎవడో గుర్రంమీద వేగంగా వచ్చి చేరాడు.

"వార్త లేమిటి, జాతా?"

"ఏం చెప్పమన్నారు?"

ఇంతలో పల్లకీ ఒకటి వచ్చి చేరింది. దాని వెనక ఒక డోలీ.

"మీ ఉద్దేశం ఏమిటి, డాక్టర్?" అని దివాన్ అడుగుతున్నాడు.

"చెప్పలేం. తలలో బలమైన గాయమే తగిలింది."

"అమూల్యబాబు మాట?"

"గుండెలో గుండు దూసుకుపోయింది, బతకడు"

Printed and Published by A. Sudhakara Rao for Yuva Concerns and Printed at Yuva Press,
5-9-88 Public Garden Road, Hyderabad-1. Controlling Editor : Sri "CHAKRAPANI"